ADMISSIONS ARE IN PROGRESS 2024-25
Secretary & Correspondent
Bikki Venkateshwarlu
M.Sc (Physicis), M.Ed.
Join your kids with us & Empower their Academic Excellence with Ethical Foundations
INDIRA VIDYALAYA
Nursery to VII class, English Medium
Near Bodrai, Mahabubabad.
Cell: 9701912300, 9705412300

దిన పత్రిక
# తొలి సమయం
వాస్తవమే గమ్యం.. గమనం...

సంపుటి : 01 సంచిక : 274 శనివారం 28-9-2024 | ఎడిటర్ : వేముల అయోధ్య రాములు | పేజీలు : 4 | వెల : 5 రూ/..

## నేడు నగరానికి రాష్ట్రపతి

### ముర్ము రాక సందర్భంగా ట్రాఫిక్ ఆంక్షలు



హైదరాబాద్,సెప్టెంబర్27: రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఒకరోజు పర్యటనకు శనివారం హైదరాబాద్‌కు రానున్నారు. ఇక్కడ నల్సార్ వర్సిటీ స్నాతకోత్సవంలో పాల్గొంటారు. దీంతో ఆమె పర్యటన సందర్భంగా పలుచోట్ల ఆంక్షలు విధించారు. బొల్లారంలోని రాష్ట్రపతి నిలయంలో పోలీస్, రెవెన్యూ, ఆర్ అండ్ బీ, వైద్య ఆరోగ్యశాఖ, అగ్నిమాపక, అటవీ, విద్యుత్, తదితర శాఖల ఏర్పాట్లపై కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సమీక్ష నిర్వహించారు. రోడ్లపై ట్రాఫిక్ సమస్యలు ఉత్పన్నం కాకుండా భద్రతా ఏర్పాట్లు, బందోబస్తును పర్యవేక్షించాలని పోలీసులకు సూచించారు. అనంతరం రాష్ట్రపతి నిలయంలో ఏర్పాటు చేసిన 8 రాష్ట్రాలకు సంబంధించిన స్టాళ్లను, 4 ఫుడ్ కోర్టులను, మీడియా సెంటర్‌ను, ఇతర స్టాళ్లను పరిశీలించారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పర్యటన సందర్భంగా శనివారం నగరంలోని పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలుంటాయని అడిషనల్ సీపీ ట్రాఫిక్ విశ్వప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 28న ఉదయం 9 గంటల నుంచి బేగంపేట, హెచ్‌పీఎస్, పీఎన్‌టీ జంక్షన్, రసూల్‌పురా, సీటీవో ఎ÷-లాజా, టివోలి, కార్ఖానా, తిరుమలగిరి, లోతుకుంట, బొల్లారం రాష్ట్రపతి నిలయం ప్రాంతాల్లో ట్రాఫిక్ మళ్లింపులు ఉంటాయని తెలిపారు.మేడ్చల్ జిల్లా శామీర్‌పేట పరిధిలోని నల్సార్ న్యాయ విశ్వవిద్యాలయం 21వ స్నాతకోత్సవం 28న నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము హాజరవుతున్నారు. గౌరవ అతిథిగా రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ, నల్సార్ ఛాన్సలర్, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి అలోక్ అరాధే, అలాగే సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నర్సింహులు విచ్చేస్తున్నట్లు విశ్వవిద్యాలయ వీసీ క్రిష్ణదేవరావ్ మీడియాకు వెల్లడించారు.

# ఎనుముల కాదు.. ఎగవేతల రేవంత్ రెడ్డి

## అన్ని హామీలను ఎగవేస్తున్న సీఎం



### సిద్ధిపేట రైతు ధర్నాలో హరీష్‌రావు

**సిద్ధిపేట,సెప్టెంబర్27:** ఈ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి కాదు.. ఎగవేతల రేవంత్ రెడ్డి అని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు తీవ్ర విమర్శలు చేశారు. రుణమాఫీ విషయంలో కాంగ్రెస్ సర్కార్‌కు హరీశ్‌రావు డెడ్‌లైన్ విధించారు. దసరా లోపు రైతులందరికీ రుణమాఫీ చేయాలి.. లేదంటే రైతులందరితో కలిసి సచివాలయం ముట్టడిస్తామని ఆయన హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రూ. 2 లక్షల రైతు రుణమాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ సిద్దిపేట జిల్లా నంగునూరులో రైతులు నిర్వహించిన ధర్నాలో హరీశ్‌రావు పాల్గొని ప్రసంగించారు. కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడు రైతులు ఏ విధంగా ఉండే.. కాంగ్రెస్ పాలనలో రైతుల పరిస్థితి ఎలా ఉంది అనేది అందరికీ అర్థమైందన్నారు. కేసీఆర్ ముఖ్యమంత్రి కాకముందు రైతుల పరిస్థితి ఎలా ఉండే. రైతులకు ఎరువు బస్తా కావాలంటే పొద్దున ఐదు గంటలకు చెప్పులు లైన్లో పెడితే ఒక్క ఎరువు బస్తా దొరికేది. రైతులను ఎరువు బస్తాల కోసం లైన్ల నిలబెట్టింది కాంగ్రెస్. కానీ కేసీఆర్ ప్రతి ఊరికి ఎరువులను లారీల్లో పంపి రైతులకు అందించారు. కేసీఆర్ రాకముందు కాలిపోయే మోటర్లు, పేలిపోయే ట్రాన్స్‌ఫార్మర్లు. కేసీఆర్ వచ్చినంక 24 గంటల కరెంటు ఇచ్చిండు. ట్రాన్స్‌ఫార్మర్లు కాలకుండా కడుపునిండా రైతులకు కరెంటు ఇచ్చిండు. కాంగ్రెస్ పాలనలో దొంగ రాత్రి కరెంట్ వచ్చేది. కేసీఆర్ 24 గంటలు కరెంట్ అందించాడు. మళ్ళీ కాంగ్రెస్ పాలనలో కాలిపోయే మోటర్లు, పేలిపోయే ట్రాన్స్‌ఫార్మర్లు. కాంగ్రెస్ ఎమ్మెల్యే పర్ణికా రెడ్డి ఏదో మీటింగ్‌లో అంటున్నారు కేసీఆర్ ఉన్నప్పుడు 24 గంటలు కరెంటు ఎట్లా వచ్చింది ఇప్పుడు ఎందుకు వస్తలేదని కరెంట్ అధికారులను ఆమె అడిగారని హరీశ్‌రావు గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి ఏమైంది? కరోనా లేదు అయినా కూడా కాంగ్రెస్ ప్రభుత్వం రైతుబంధు ఇవ్వడం లేదని హరీశ్‌రావు ధ్వజమెత్తారు. కేసీఆర్ ఉండగా నాట్లు పడే వరకు రైతుల ఫోన్లలో టింగు టింగ్ అని రైతుబంధు పడేది. ఇప్పుడు నాట్లు అయి, కలుపై, పంటకు మందు కొట్టుడు కూడా అయిపోయింది. పంట కోతకు ఉన్నా, దసరా పండుగ దగ్గరకు వస్తున్నా ఇంకా రైతుబంధు పడలేదు. మాటలు మాత్రం కోటలు దాటుతాయి. అన్ని వంకర మాటలే కానీ రైతులకు మాత్రం రైతుబంధు వేస్తలేడు రేవంత్ రెడ్డి. రైతుబంధుకు కేసీఆర్ ఉండంగా ఎకరానికి రూ.4,000 ఇచ్చిండు. మళ్లీ గెలిస్తే రూ.5,000 ఇస్తానని ఇచ్చిండు. మళ్లీ గెలిస్తే రూ. 8,000 చేస్తా అన్నాడు గెలిస్తే చేస్తుండే. కాంగ్రెస్ గెలిచి రూ. 7,500 రైతుబంధు ఇస్తా అన్నారు. పోయిన యాసంగికి రూ. 5,000 ఇచ్చిండ్రు. ఈ పంటకు మొత్తానికి ఎగబెట్టారని హరీశ్‌రావు మండిపడ్డారు. ల్గ÷తులను అప్పుల పాలు చేస్తున్నడు రేవంత్ రెడ్డి. పంట పెట్టుబడి కోసం రైతులు అప్పులు చేసే పరిస్థితి ఏర్పడింది. అబద్దాలు చెప్పి కుంటి సాకులు చెప్పి ఇప్పటిదాకా రైతులకు రైతుబంధు పైసలు ఇవ్వలేదు. రాష్ట్రంలో రైతులను ఆగం చేయడం కాదా? కేసీఆర్ ఒక్కసారి కాదు 11 సార్లు రైతుబంధు ఇచ్చిండు. ఊరు ఊరుకి కొనుగోలు కేంద్రాలు పెట్టి టైమ్‌కు వడ్లు కొనుడు అయినా, వడ్లను కొన్న పైసలు కూడా మూడు రోజులనే రైతులకు అందించిండు కేసీఆర్ అని హరీశ్‌రావు తెలిపారు.



## మంత్రి పొంగులేటి నివాసాలపై ఇడి దాడులు

### పలుచోట్ల ఏక కాలంలో దాడులు
### ఢిల్లీ నుంచి వచ్చిన ప్రత్యేక బృందాలతో సోదాలు



**హైదరాబాద్,సెప్టెంబర్27:** తెలంగాణ రెవెన్యూ, పౌరసరఫరాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి నివాసాల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులు సోదాలు చేపట్టారు. ఢిల్లీ నుంచి వచ్చిన అధికారుల బృందం ఏకకాలంలో 15 చోట్ల తనిఖీలు చేస్తోంది. గత ఎన్నికల సమయంలో పొంగులేటి శ్రీనివాస రెడ్డి నివాసాల్లో అధికారులు సోదాలు చేపట్టారు. జూబ్లీహిల్స్‌లోని మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ఇంట్లో ఈడీ అధికారులు తనిఖీలు చేపట్టారు. హిమాయత్ సాగర్‌లో గల ఫామ్ హౌస్, పొంగులేటి శ్రీనివాస రెడ్డి కూతురు, బంధువుల ఇళ్లలో రైడ్స్ కొనసాగుతున్నాయి. పొంగులేటి శ్రీనివాస రెడ్డికి చెందిన రాఘవ కన్ స్ట్రక్షన్స్ ఇన్ ఫ్రా కార్యాలయాల్లో ఈడీ అధికారులు సోదాలు చేపట్టారు. కంపెనీ ఎండీ, డైరెక్టర్ల నివాసాలు, కార్యాలయాల్లో 15 బృందాలు తనిఖీలు చేపట్టింది. ఖమ్మంలో ఉన్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్ ఇంటిలో రైడ్స్ కొనసాగుతున్నాయి. ఢిల్లీ జోనల్ అధికారులు తనిఖీలు చేపట్టారని తెలిసింది. నారాయణ పేట-కొడంగల్ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టును రాఘవ కన్ స్ట్రక్షన్ కంపెనీ దక్కించుకుంది. దీనికి సంబంధం లేదని తెలుస్తోంది. గత ఎన్నికలకు ముందు కూడా పొంగులేటి ఇళ్లు, కార్యాలయాలపై దాడులు జరిగిన సంగతి తెలిసిందే. ఇప్పుడు జరుగుతున్న రైడ్స్ దానికి కొనసాగింపు అని తెలుస్తోంది. పొంగులేటి శ్రీనివాస రెడ్డి కుమారుడు హర్ష రెడ్డి చిన్న వయస్సులోనే బిలియనీర్‌గా మారారు. రాఘవ కన్ స్ట్రక్షన్స్ వ్యవహారాలను ఆయనే పర్యవేక్షిస్తున్నారు. హర్ష రెడ్డి పేరుతో రూ.1300 కోట్ల ఆస్తులు ఉన్నాయి. ఇది చర్చానీయాంశం అవుతుంది. ఆ క్రమంలో వరసగా ఈడీ రైడ్స్ జరగడం చర్చకు దారితీస్తోంది.

## చెస్ క్రీడాకరులకు సిఎం అభినందన

### అర్జున్, హారికలకు 25లక్షల చొప్పున నజరానా



హైదరాబాద్,సెప్టెంబర్27: జూబ్లీహిల్స్ నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని చెస్ ఒలంపియాడ్ లో స్వర్ణపథకం సాధించిన తెలంగాణ ఆటగాళ్లు మర్యాదపూర్వకంగా కలిసారు. చెస్ ఒలంపియాడ్‌లో స్వర్ణపథకాలు సాధించిన తెలంగాణ ఆటగాళ్లను సిఎం రేవంత్ అభినందించారు. వారికి 25 లక్షల చొప్పున నగదు బహుమతనిని ప్రకటించారు. భారతదేశం తరపున మొదటిసారి స్వర్ణపథకాలు సాధించిన తెలంగాణ ఆటగాళ్లు అర్జున్ (హన్మకొండ), ద్రోణవల్లి హారిక (ఖమ్మం). ఇద్దరు ఆటగాళ్లకు చెరో రూ.25లక్షలు నగదు ప్రోత్సాహకం ప్రకటించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వారిని అభినందించారు. సెప్టెంబర్ 10 నుంచి 23 వరకు బుడా పెస్ట్, హంగరీలో జరిగిన చెస్ ఒలంపియాడ్‌లో వీరు స్వర్ణపతకాలు సాధించారు.

## పేదల కన్నీళ్లతో ఆడుకుంటే పతనం తప్పదు

- పేదలను రోడ్డున పడేసే చర్యలు ఆపాలి
- హైడ్రా పేరుతో సామాన్యులకు ఇక్కట్లు - బాధితులకు అండగా నిలిచిన ఎంపి ఈటెల

**హైదరాబాద్,సెప్టెంబర్27:** హైడ్రా పేరుతో రేవంత్‌రెడ్డి సర్కార్ డ్రామాలు ఆడుతోందని మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ విమర్శలు చేశారు. పేదలను రోడ్డున పడేసే చర్యలు ఆపాలని డిమాండ్ చేశారు. ఏళ్లుగా ఉంటున్న వారిని ఎలా ఖాళీ చేయిస్తారని ప్రశ్నించారు. ప్రజలకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నారని మండిపడ్డారు. మాజీ ఆర్థిక మంత్రిగా చెబుతున్నాను... రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ కుప్పకూలిపోయింది. అప్పుల ఊబిలో రాష్ట్రం కురుకుపోయిందని అన్నారు.పేదల కన్నీళ్లతో ఆడుకుంటే రేవంత్ ప్రభుత్వానికి పతనం తప్పదని ఎంపీ ఈటల రాజేందర్ వార్నింగ్ ఇచ్చారు. హైడ్రాను నియమించిన రోజే ఇది డ్రామా అని చెప్పానని అన్నారు. హైడ్రా అధికారులు చెబుతున్న లెక్కల ప్రకారం చెరువులు, కుంటలు చుట్టూ ఉంది.. ప్రభుత్వ భూమి కాదని స్పష్టం చేశారు. ఎన్నో ఏళ్లుగా ఉన్న పేదల ఇళ్లను కూల్చవద్దని ఎంపీ ఈటల రాజేందర్ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కోరారు. చైతన్యపురి డివిజన్ న్యూ మారుతి నగర్ మూసీ పరిసర ప్రాంతాల్లో ఈటల రాజేందర్ శుక్రవారం పర్యటించి బాధితులకు అండగా ఉంటానని ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా ఈటల రాజేందర్ మాట్లాడుతూ... పేదలపై కనికరం లేకుండా రేవంత్ ప్రభుత్వ చర్యలు ఉన్నాయని ధ్వజమెత్తారు. జొన్నల బండ వద్ద మాజీ ప్రధానమంత్రి ఇందిరాగాంధీ పేదలకు ఇళ్ల పట్టాలు ఇచ్చారని వాటిని కూడా కూల్చేందుకు రేవంత్ ప్రభుత్వం పనులు చేస్తోందని ఈటల రాజేందర్ అన్నారు. మూసీని సుందరీకరణ చేస్తే తమకు ఇబ్బంది లేదు... కానీ ఎన్నడో భూమి కొన్న వారు ఇప్పటికీ ఈఎంఐలు కడుతున్నారని తెలిపారు. లక్షలు పెట్టి కొన్న ఇళ్లకు డబుల్ బెడ్ రూం ఇళ్లు ఇస్తామనడ భావ్యంకాదని ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. ఈ ప్రాంతాల్లోకి ఏనాడూ మూసీ నుంచి వరద నీరు రాలేదని తెలిపారు. హైడ్రా పేరుతో రేవంత్ ప్రభుత్వం బస్తీ ప్రజలకు కంటి మీద కునుకు లేకుండా చేస్తోందని ఎంపీ ఈటల రాజేందర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.



## పర్యాటక ప్రాంతాలుగా చారిత్రక భవనాలు

### హైదరాబాద్ సంస్కృతిని ప్రతిబింబించే కట్టడాల పరిరక్షణ
### పురాతన మెట్ల బావులు పునరుద్ధరణ కోసం సీఐఐ ఒప్పందం
### మూసీ ప్రక్షాళన ప్రతిష్టాత్మకంగా తీసుకున్నామన్న సిఎం రేవంత్



**హైదరాబాద్,సెప్టెంబర్27:** మూసీ పరివాహక ప్రాంతంలో చారిత్రాత్మక భవనాలను పర్యాటక ప్రాంతాలుగా తీర్చిదిద్దుతామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. హైదరాబాద్ సంస్కృతిని ప్రతిబింబించే కట్టడాల పరిరక్షణకు ముందుకు రావాలని ఆయన పారిశ్రామికవేత్తలకు సూచించారు. రాష్ట్రంలో సంక్షేమంతో పాటు పర్యాటక రంగాన్ని కూడా ముందుకు తీసుకెళతామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. హైదరాబాద్ లోని పలు పురాతన మెట్ల బావుల పునరుద్ధరణ కోసం సీఐఐ తో రాష్ట్ర పర్యాటక శాఖ శుక్రవారం ఒప్పందం చేసుకుంది. కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ మూసీ ప్రక్షాళన కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుందన్నారు. గత ప్రభుత్వాల నిర్లక్ష్యంగా కారణంగా నగరంలోని అనేక చారిత్రక కట్టడాలు శిథిలావస్థకు చేరుకున్నాయని సీఎం అన్నారు. ప్రస్తుతం పాత అసెంబ్లీ భవనాన్ని పునరుద్ధరిస్తున్నామని, త్వరలోనే అందులో శాసన మండలి ఏర్పాటు చేయనున్నట్లు ముఖ్యమంత్రి వెల్లడించారు. ప్రస్తుతం శాసనమండలి ఉన్న జూబ్లీ హాల్ కు చారిత్రక ప్రాధాన్యత ఉందన్నారు. ప్రత్యేక టెక్నాలజీతో ఆ భవనాన్ని నిర్మించారని, భవిష్యత్తులో దాన్ని పరిరక్షించాల్సిన అవసరముందని సీఎం అభిప్రాయపడ్డారు. జూబ్లీహాల్ ను దత్తత తీసుకొని పరిరక్షించాలని ఆయన సీఐఐకి సూచించారు. ఉస్మానియా ఆస్పత్రి భవనాన్ని పరిరక్షిస్తామని, ఇందుకోసం చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఉస్మానియా ఆస్పత్రిని గోషామహల్ స్టేడియానికి తరలిస్తున్నట్లు సీఎం వివరించారు. హైకోర్టు భవనాన్ని కూడా రక్షించాల్సిన అవసరముందని సీఎం అన్నారు. రాజేంద్రనగర్ లో హైకోర్టు నూతన భవనం నిర్మాణం కోసం 100 ఎకరాల స్థలాన్ని కేటాయించినట్లు ముఖ్యమంత్రి తెలిపారు. హైదరాబాద్ సిటీ కాలేజ్ భవనంతో పాటు పురానాపూల్ బ్రిడ్జి వంటి చారిత్రక కట్టడాలను పరిరక్షించు కోవాల్సిన అవసరముందన్నారు.

## రాజకీయ కుట్రతోనే ఇడి దాడులు

### పొంగులేటి ఇంట్లో దాడులపై మహేశ్ కుమార్

**హైదరాబాద్,సెప్టెంబర్27:**
మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఇంటిపై జరిగిన ఈడీ దాడులపై టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ స్పందించారు. గాంధీ భవన్ లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. బీఆర్ఎస్, బీజేపీ పార్టీల లోపాయికారి ఒప్పందంలో భాగంగానే రాష్ట్రంలో ఈడీ దాడులు జరుగు తున్నాయని ఆరోపించారు.
మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఇంటిపై జరిగిన ఈడీ రైడ్స్ ఈ కుట్రలో భాగమేనని అన్నారు. 2014లో కేంద్రంలో మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి 96 శాతం ప్రతిపక్షాల మీదనే దాడులు జరుగుతున్నాయని గుర్తు చేశారు. రాజకీయ లబ్ది పొందడానికి ప్రతిపక్ష పార్టీల నేతలపై బీజేపీ అక్రమ కేసులు బనాయిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీ అక్రమ కేసులను మేం రాజ్యాంగ బద్ధంగా ఎదుర్కొంటామని స్పష్టం చేశారు. ఇక, ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన హైడ్రా గురించి మాట్లాడుతూ.. హైడ్రా కూల్చివేతల వల్ల నష్టపోతున్న పేదలను ఆదుకుంటామన్నారు. ఎన్నికల్లో హామీ ఇచ్చిన మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేసిందని తెలిపారు. రుణమాఫీపై ప్రతిపక్ష బీఆర్ఎస్ తప్పుడు ప్రచారం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రుణమాఫీపై హరీష్ రావు చర్చకు సిద్ధమా అని సవాల్ విసిరారు.

# బడిలో పిల్లల భద్రత పాఠశాల యాజమాన్యాలదే బాధ్యత

**- గృహ హింస చట్టం మతాతీతం - ఈ రెండు సుప్రీంకోర్టు తీర్పులపై హర్షం వ్యక్తం చేస్తున్నాం**

**- ఎన్ హెచ్ ఆర్ సి. నల్గొండ జిల్లా అధ్యక్షులు వెన్నమల్ల అంజయ్య**



**తొలి సమయం నల్గొండ టౌన్ సెప్టెంబర్ 26:** పాఠశాలల్లో బాలల రక్షణకు యాజమాన్యాలను బాధ్యులుగా చేస్తూ కేంద్రం ఇచ్చిన మార్గదర్శకాలను అమలు చేయాలని సుప్రీంకోర్టు ఆదేశించడం శుభ పరిణామమని జాతీయ మానవ హక్కుల కమిటీ (ఎన్ హెచ్ ఆర్ సి) నల్గొండ జిల్లా శాఖ అధ్యక్షులు వెన్నమల్ల అంజయ్య హర్షం వ్యక్తం చేశారు. పాఠశాలల్లో బాలలపై వేధింపులు, నేరాలు పెరిగిన దరిమిలా ఈ మార్గదర్శకాలను దేశవ్యాప్తంగా అమలు చేయాలని ఆదేశించడం ద్వారా 6-14 ఏళ్ల లోపు బాలలకు స్వేచ్ఛాయుత విద్యను తప్పనిసరి ఆర్టికల్ 21ఏ ప్రకారం పూర్తిస్థాయిలో అందించడం సాధ్యమవుతుందని అన్నారు. అలాగే దేశంలోని ప్రతి మహిళకు గృహహింస చట్టం 2005 ఇతోధికంగా దోహదపడుతుందని సుప్రీంకోర్టు ధర్మాసనం ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నామని అంజయ్య అన్నారు. ఈ సందర్భంగా అంజయ్య మాట్లాడుతూ..మతం, సామాజిక నేపథ్యంతో సంబంధం లేకుండా స్త్రీలందరికి ఇది వర్తించడం ద్వారా దేశంలోని ప్రతి మహిళకు గృహహింస నుంచి రక్షణ కల్పిస్తుందని అన్నారు. దేశంలో పుట్టిన ప్రతి ఆడబిడ్డకు అన్యాయం జరగడానికి వీలు లేదని అన్నారు. భారత రాజ్యాంగ చట్టాలను ఈ దేశంలో పుట్టిన ప్రతి ఒక్కరు కుల మతాలకు అతీతంగా గౌరవించాల్సిందేనని స్పష్టం చేశారు. బాలికలు,మహిళల పట్ల దేశంలోని అత్యున్నత న్యాయస్థానం ఇచ్చిన ఈ రెండు తీర్పుల వల్ల దేశంలో కొంతవరకు నేరాలను, ఘోరాలను అరికట్టవచ్చని అభిప్రాయపడ్డారు. ఈ తీర్పుల విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పకడ్బందీగా అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు.

# బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి కొండ లక్ష్మణ్ బాపూజీ

**జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్**

**తొలి సమయ మహబూబాబాద్,సెప్టెంబర్27**
తెలంగాణ స్వాతంత్ర్య సమరయోధుడు, బడుగు,బలహీన వర్గాల స్ఫూర్తిప్రదాత కొండా లక్ష్మణ్ బాపూజి అని జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ అన్నారు.శుక్రవారం ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ 109వ జయంతిని పురస్కరించుకొని ఐ.డి.ఓ.సి. లోని ప్రధాన సమావేశ మందిరంలో జిల్లా బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొండా లక్ష్మణ్ బాపూజి జయంతి వేడుకల్లో ముఖ్య అతిథి జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ పాల్గొని కొండా లక్ష్మణ్ బాపూజి చిత్రపటానికి పూలమాలలతో ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ...బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి, తెలంగాణ గర్వించ దగ్గ గొప్ప నాయకుడు కొండా లక్ష్మణ్ బాపూజీ అని, తెలంగాణ మహెూద్యమంలో విరోచితంగా కృషిచేసిన స్వతంత్ర సమరయోధుడు, తెలంగాణ పోరాట యోధుడు కొండా లక్ష్మణ్ జయంతి వేడుకలను అధికారికంగా నిర్వహించుకోవడం అత్యంత గొప్ప విషయమన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యు అదనపు కలెక్టర్ ఎం.డేవిడ్, బిసి సంక్షేమ అధికారి నరసింహ స్వామి బిసి సంఘ నాయకులు, అధికారులు తదితరులు పాల్గోన్నారు



# సెప్టెంబర్ 28 జరిగే జాతీయ లోక్ అదాలత్‌ను జయప్రదం చేయండి

**రవీంద్రశర్మ, జిల్లా ప్రధానన్యాయమూర్తి**



**తొలి సమయం మహబూబాబాద్ సెప్టెంబర్ 27:** జాతీయ మరియు రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థల ఆదేశాలను అనుసరించి మన మహబూబాబాద్ జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ఈనెల 28వ తేదీన శనివారం రోజున జాతీయ లోక్ ఆదాలతును మహబూబాబాద్ జిల్లా కోర్టులో నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసామని, జిల్లా ప్రధాన న్యాయమూర్తి మరియు చైర్మన్ జిల్లా న్యాయసేవాధికార సంస్థ, బి. రవీంద్రశర్మ తెలియజేశారు.


ఈరోజు జిల్లా కోర్టుల ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ కక్షిదారులు తమతమ కేసులను రాజీ కుదుర్చుకోవాల్సిందిగా విజ్ఞప్తి చేశారు ఈ జాతీయ లోక్ ఆదాలతులో రాజీ పడదగు క్రిమినల్, సివిల్, భూతగాదా, మోటార్ వెహికల్ యాక్సిడెంట్, వివాహ కుటుంబ తగాదా కేసులు, బ్యాంకు, చెక్ బౌన్స్, ఎలక్ట్రిసిటీ, చిట్ ఫండ్స్, డిజాస్టర్ మేనేజ్మెంట్, ఇన్సూరెన్స్, ఎక్సైజ్, విద్యుత్ చోరీ, ట్రాఫిక్, ఈ చలాన్ కేసులు, ఇతర రాజీ పడదగు అన్ని కేసులను ఇరుపక్షాల అంగీకారంతో పరిష్కరించుటకు సిద్ధంగా ఉన్నామని తెలియజేశారు. ఈ జాతీయ లోక్ అదాలథ్ లోరాజీ పడదగు కక్షిదారులు తమ తమ కేసుల వివరాలను సంబంధిత కోర్టులలో తెలియపరచి రాజీ కుదుర్చుకొని ప్రశాంతమైన జీవితాన్ని పొందాలని, కోర్టుల చుట్టూ తిరిగి ఎంతో విలువైన తమ సమయాన్ని మరియు డబ్బును కోల్పోకుండా చక్కని జీవనాన్ని కొనసాగించాలని తెలిపారు. రాజీపడదగు కక్షిదారులు తమ న్యాయవాదులతో నేరుగా కోర్టులో హాజరై తమ కేసులను పరిష్కరించుకొని జాతీయలోక్ అదాలత్ విజయవంతం చేయుటకు గాను ఇప్పటికే పోలీసు అధికారులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, ఇన్సూరెన్స్ అధికారులు, న్యాయవాదులతోనూ, వేరువేరుగా సమావేశాలు నిర్వహించి అధిక కేసుల పరిష్కార దిశగా చర్యలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు ఇప్పటివరకు జిల్లా వ్యాప్తంగా గుర్తించబడిన కేసులలో మొత్తం పెండింగ్ కేసులను పరిష్కరించుటకు సిద్ధంగా ఉన్నామని తెలియజేసారు.ఇందులకు గాను మొత్తము నాలుగు లోక్ అదాలత్ బెంచీలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఇప్పటి వరకు జరిగిన జాతీయలోక్ అదాలత్లను విజయవంతం చేయుటకు తోడ్పడిన ప్పోలీస్ అధికారులు, న్యాయవాదులు ప్రింట్ మీడియా, ఎలక్ట్రానిక్ మీడియా పాత్ర అని అనిర్వచనీయమని కొనియాడారు. లోక్ అదాలథ్ ను వినియోగించుకునే విషయమై ఎటువంటి సలహాలు సందేహాలకు లేదా ఏదేని న్యాయ సహాయం కొరకైనను న్యాయ సేవాధికార సంస్థను ఆశ్రయించి ఉచిత న్యాయ సలహాలు, సూచనలు పొందవలసిందిగా కోరడం జరిగింది.

# జగన్‌ను తిరుమల వెళ్లకుండా అడ్డుకున్నామా...

**- జగన్‌కు పోలీసులు అలా నోటీసులు ఇచ్చారా - అబద్దాల ప్రచారంతో ప్రజలను మోసం చేయలేరు**

**- తిరుమల పవిత్రతను ఎవ్వరైనా కాపాడాల్సిందే - జగన్ వ్యాఖ్యలపై మండిపడ్డ సిఎం చంద్రబాబు**

**అమరావతి,సెప్టెంబర్27:** వైకాపా అధినేత జగన్‌ను తిరుమలకు వెళ్ల వద్దని ఎవరూ చెప్పలేదని, ర్యాలీలు, జనసమీకరణలు చేయొద్దని మాత్రమే చెప్పామని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. తిరుమల అంశంపై జగన్ చేసిన ఆరోపణలు ఖండించారు. వెలగపూడిలోని సచివాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో చంద్రబాబు మాట్లాడారు. నోటీసులు ఇచ్చారు, నిలుపుదల చేశారని ఆరోపిస్తున్నారు.. జగన్‌కు ఏమైనా పోలీసులు నోటీసులు ఇచ్చారా అని ప్రశ్నించారు. జగన్‌ను వెళ్లొద్దని నోటీసులు ఇస్తే.. మీడియాకు చూపించాలని డిమాండ్ చేశారు. అబద్దాలు ప్రచారం చేస్తూ.. ప్రజలను ఎందుకు మభ్యపెడుతున్నారని మండిపడ్డారు. ఇటీవల తితిదేలో చోటుచేసుకున్న పరిణామాల వల్ల భక్తుల మనోభావాలు దెబ్బతిన్నాయి. దీంతో భక్తులు ఆందోళనలో ఉన్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకూడదనే ఉద్దేశంతో తిరుపతిలో సెక్షన్ 30 పోలీసు యాక్ట్ అమల్లో ఉంది. ఏ మతానికైనా కొన్ని సంప్రదాయాలు, ఆచారాలు ఉంటాయి. తిరుమలకు వెళ్లాలంటే ఎవరైనా ఆచారాలు, నియమాలు పాటించాల్సిందే. ఆచారాలు పాటించకపోతే భక్తుల మనోభావాలు దెబ్బతింటాయి. భక్తులు పవిత్రంగా భావించే క్షేత్రాన్ని రక్షించాల్సిన బాధ్యత మనపై ఉంది. ఇతర మతాలను గౌరవించాలి. సొంత మతాన్ని ఆచరించాలని చంద్రబాబు అన్నారు. ఇంతకుముందు జగన్ నియమాలు ఉల్లంఘించి తిరుమల వెళ్లారు. చాలా మంది డిక్లరేషన్ ఇచ్చి గౌరవంగా దర్శనం చేసుకున్నారు. ఇతర మతాలను గౌరవించడం



అంటే.. ఆయా ఆలయాల సంప్రదాయాలను పాటించడమే. బైబిల్‌ను నాలుగు గోడల మధ్యే ఎందుకు చదవాలి.. చర్చికి కూడా వెళ్లి బైబిల్ చదవొచ్చు. చెప్పిన అబద్దాన్నే పదే పదే చెబుతున్నారు. నెయ్యి కల్తీ జరగలేదని అంటున్నారు. ఏఆర్ డెయిరీ 8 ట్యాంకర్లు పంపింది.. అందులో 4 ట్యాంకర్లు వాడారు. ఈ నివేదిక ఇచ్చింది ఎన్‌డీడీబీ.. మేం కాదు. ఈ నివేదిక దాస్తే మేం తప్పు చేసినట్లే అవుతుంది. నెయ్యి కల్తీ జరగలేదని మీరు ఎలా చెబుతున్నారు. అడల్టరేషన్ పరీక్షకు గతంలో మీరు ఎందుకు పంపలేదు? టెండర్లు పిలిచేందుకు నిబంధనలు ఎందుకు మార్చారో చెప్పాలి? నాసిరకం పదార్థాలతో ప్రసాదాన్ని అపవిత్రం చేశారు. ఈవో చెప్పలేదు.. నివేదికలు లేవు అంటూ అబద్దాలు చెబుతున్నారు. రామతీర్థం, అంతర్వేది ఘటనలపై ఇప్పటి వరకు విచారణ జరగలేదు. క్రైస్తవుడిని అని ఒప్పుకొన్నాక డిక్లరేషన్ ఇచ్చేందుకు ఇబ్బంది ఏంటి? మీరు చేసిన అబద్దాలను ఖండించకుంటే అవే నిజమని అనుకుంటారు. తప్పు జరిగినప్పుడు విచారం వ్యక్తం చేయాలి.. ఎదురుదాడి కాదు. స్వామి వారికి మీరు చేసిన అపచారాలు నేను కప్పిపుచ్చాలా? రాజకీయ ముసుగులో నేరస్థులు వస్తే ఇలాంటివే జరుగుతాయని అన్నారు. రాజకీయ పార్టీకి ఉండాల్సిన లక్షణాలు, అర్హతలు మీకున్నాయా? ఇష్టమైతేనే తిరుమలకు వెళ్లండి లేకపోతే వెళ్లొద్దు. తిరుమలకు వెళ్తే ఆలయ సంప్రదాయాలు పాటించాల్సిందే. అన్య మతస్థులు ఎవరు వచ్చినా తిరుమలలో డిక్లరేషన్ ఇవ్వాల్సిందే. భక్తుల మనోభావాలు దెబ్బతీసే హక్కు మీకెవరిచ్చారు. దళితులను ఆలయాల్లోకి రానీయడం లేదని మీకెవరు చెప్పారు? సీఎంగా ఉన్నప్పుడే చట్టాలను ఉల్లంఘించానని ఎలా చెబుతారు? చట్టాలను సంప్రదాయాలను గౌరవించడంలో మొదటి వ్యక్తిగా సీఎం ఉండాలి.స్వామివారిని రాజకీయాలకు, వ్యాపారాలకు వాడుకోవడం మీరు చేసిన తప్పు. తితిదే అధికారుల నియామకంలో మీరు చేసింది అధికార దుర్వినియోగం. తిరుమలలో తెలిసీ తెలియక పొరపాట్లు చేస్తే సంప్రోక్షణ చేస్తారు. ఈ నెల 23న శాంతియాగం చేశారు. క్వాలిటీ, స్వచ్ఛత పవిత్రత చాలా ముఖ్యం. వేంకటేశ్వరస్వామి సన్నిధిలో అపవిత్రత జరగకుండా చూస్తాం. కల్తీ ఘటనలో తప్పు చేసిన అందరిపై చర్యలు ఉంటాయని చంద్రబాబు స్పష్టం చేశారు.

## ఆకృతి ఇన్ఫ్రా డెవలపర్స్ బ్రోచర్స్‌కు భద్రకాళీ పూజారులచే పూజ



**తొలి సమయం మహబూబాబాద్27:**
ఆకృతి ఇన్ఫ్రా డెవలపర్ రవీందర్ చైర్మన్ బానోత్ రవీందర్ మరియు మల్లేశం కృష్ణ ప్రసాద్ ఆధ్వర్యంలో ఆకృతి ఇన్ఫ్రా డెవలపర్స్ బ్రోచర్ కు భద్రకాళి పూజారులచే పూజా కార్యక్రమం నిర్వహించారు ఈ కార్యక్రమంలో లంబాడా లైవ్ ఐక్యవేదిక జిల్లా అధ్యక్షులు లావుద్య రాజు నాయక్ అలువాల రాజ్ కుమార్ సోమేశ్వర్ ఎండి కాసిం భూక్యా మోహన్ నాయక్, అశోక్ పున్నం కరెంటు తిరుపతి నాయక్, లకావత్ సుమన్, రాళ్లపల్లి నవీన్ మొదలైన వారు ఈ బ్రోచర్స్ ని విడుదల చేయనైనది అదేవిధంగా సభ్యత్వ నమోదు కార్యక్రమం జరిగింది ప్లాట్స్ బుకింగ్ చేయడం కూడా జరిగింది ఈ కార్యక్రమానికి సహకరించిన కమిటీ సభ్యులందరికి భానోత్ రవీంద్ర నాయక్ మరియు మల్లేశం కృష్ణ ప్రసాద్ కృతజ్ఞతలు తెలిపారు.

## మంత్రాల నేపంతో వ్యక్తి హత్య



**తొలి సమయం మహబూబాబాద్ జిల్లా 27:**
ఇనుగుర్తి మండలం చిన్న ముప్పారం గ్రామంలో మంత్రాల నేపంతో వ్యక్తిని హత్య చేసిన సంఘటన చోటుచేసుకుంది వివరాల్లోకి వెళితే చిన్న ముప్పారం గ్రామానికి చెందిన మల్లం యాకయ్య అనే వ్యక్తిని మంత్రాలు చేశాడనే అనుమానంతో అదే గ్రామానికి చెందిన వ్యక్తి కొట్టి చంపాడు, ప్రత్యేక్షంగా హత్య చేసిన వ్యక్తి నేనే హత్య చేశానని ఒప్పుకోవడం విస్మయానికి గురి చేసింది. నాకు మంత్రాలు చేశాడు కాబట్టి చంపాను అంటూ గ్రామస్తులకు చెప్పడంతో..చంపిన వ్యక్తిని తాళ్లతో కట్టేసి పోలీసులకు గ్రామస్తులే అప్పజెప్పినట్లు విశ్వసనీయ సమాచారం

## భారీ ఎండు గంజాయిని పట్టుకున్న మానుకోట పోలీస్..

**31,75,000/- విలువ గల ఎండు గంజాయి**

**పట్టుకున్న మరిపెడ పోలీసులు**

**హైదరాబాద్ కు తరలిస్తుండగా మరిపెడ**


**మండలంలోని గాలివారి గూడెం వద్ద 127కేజీల స్వాదీనం..**

**నిందితుడిని రిమాండ్ కి తరలింపు..కారు స్వాదీనం..**

**వివరాలు వెల్లడించిన మహబూబాబాద్**

**జిల్లా ఎస్పీ సుధీర్ రాంనాధ్ కేకన్ ఐపీస్**





**తొలి సమయం మహబూబాబాద్ సెప్టెంబర్ 17 :**
శుక్రవారం 4గంటలకు గాలివారిగూడెం స్టేజ్ ఏ ఎన్ ఆర్ గార్డెన్ సమీపంలోని వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా నిందితుడిని పట్టుకుని అతని వద్ద నుంచి 127 కిలోల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితుల వివరాలు: సోడి నాగేశ్వర రావు తండ్రి హెమేశ్వర్, 40 సం.లు., కోయ కొయ, రెవెన్యూ డిపార్ట్మెంట్ ఉద్యోగి గ్రామం అసీర్ గూడెం, కుంటా మండలం, సుకుమా జిల్లా, ఛత్తీస్ ఘడ్ రాష్ట్రం ప్రెస్ మీట్ అనంతరం గంజాయి పట్టుకోవడం లో చాకచక్యంగా విధులు నిర్వహించిన అధికారులు సిబ్బందికి మహబూబాబాద్ జిల్లా ఎస్పీ సుధీర్ రాంనాధ్ రివార్డ్స్ అందించి అభినందించారు

## వ్యక్తి హత్య చేసిన ఘటనలో నిందితుడి అరెస్ట్, రిమాండ్‌కు తరలింపు

**వివరాలు వెల్లడించిన తొర్రుర్ సీఐ జగదీష్**




**తొలి సమయం మహబూబాబాద్ సెప్టెంబర్ 27 :**
మహబూబాబాద్ జిల్లా ఇనుగుర్తి మండలం చిన్న ముప్పారం గ్రామానికి చెందిన మల్లం యాకయ్య, రామయ్య, వయసు 60, చిన్నముప్పారం అనే వ్యక్తిని మంత్రాలు చేశాడనే అనుమానంతో ఈరోజు ఉదయం సుమారు 6:30 లకు అదే గ్రామానికి చెందిన మల్లం రాజు తండ్రి వెంకటనర్సులు, వయసు 45, చిన్నముప్పారం, ముత్యాలమ్మ గుడి వద్ద మంచం కాలు తో తలపైన కొట్టి చంపినాడని అతని కొడుకు మల్లం రమేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సంఘటన స్థలానికి వెళ్లి విచారించి మల్లం రాజు అనే వ్యక్తి అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించడం జరిగింది.

# తిరుమలలో సంప్రదాయాలు పాటించాల్సిందే

**- హైందవేతరులు డిక్లరేషన్ సమర్పించాల్సిందే**

**- గత ఐదేళ్లో కొండపై ఎన్నో పాప కార్యాలు నడిచాయి - సాధు పరిషత్ అధ్యక్షుడు శ్రీనివాసానంద సరస్వతి**

**తొలి సమయం తిరుపతి,సెప్టెంబర్27:** తిరుమల శ్రీవారిని దర్శించుకోవాలంటే ఎవరైనా సంప్రదాయాలు పాటించాలని సాధు పరిషత్ అధ్యక్షుడు శ్రీనివాసానంద సరస్వతి స్వామీజీ అన్నారు. తిరుపతిలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. జగన్ ఏనాడైనా ఆయన సతీమణిని శ్రీవారి దర్శనానికి తీసుకొచ్చారా? మన ఇంట్లో పూజ చేస్తేనే పక్కన భార్య ఉండేట్లు చూసుకుంటాం. హిందువుల మనోభావాలు, విశ్వాసాలను ఆయన ఏనాడూ గౌరవించలేదని అన్నారు. గతం గతః.. ఇప్పుడు డిక్లరేషన్ ఇవ్వడం ద్వారా ముందుకు సాగాలన్నారు. హిందుత్వానికి కష్టమొచ్చింది.. అందరం ఒక్కటై కాపాడు కోవాలి. తిరుమల క్షేత్ర ప్రాశస్త్యాన్ని వైకాపా ప్రభుత్వం ఎప్పుడూ కాపాడలేదు. గత ఐదేళ్లలో ఎన్నో పాపాలు జరిగాయి.. ప్రక్షాళన జరగాల్సిందే. ఏనాడైనా డిక్లరేషన్‌పై జగన్ సంతకం చేశారా? ఆలయాలు, పూజారులపై దాడులు జరిగినా ఏనాడూ స్పందించలేదు. ఐదేళ్లలో అనేక అఘాయిత్యాలు జరిగాయి. భయానక వాతావరణం సృష్టించారు. ఇలాంటి వాళ్లు తిరుమల క్షేత్రానికి వస్తున్నారంటే జాగ్రత్తగా ఉండాల్సిందే. సనాతన పరిరక్షణ బోర్డు ఏర్పాటు కావాలి. దీనికి రాజకీయ పక్షాలన్నీ సహకరించాలి. జగన్, వైకాపాపై మాకు వ్యక్తిగత ద్వేషం లేదు. ఆలయాల సంప్రదాయాలను గౌరవించకపోవడాన్ని తప్పు పడుతున్నాం. డిక్లరేషన్ ఇచ్చేందుకు అభ్యంతరమేంటని ప్రశ్నించారు. తిరుమల పర్యటనలో కోడికత్తి నాటకాలాడతారని అనుమానాలున్నాయి. శాంతి భద్రతలకు విఘాతం కలిగించేందుకు యత్నిస్తారనే అనుమానం కలుగుతోంది. గత ఐదేళ్లలో తిరుమలను వ్యాపార కేంద్రంగా మార్చారు. తమ కుటుంబ సభ్యులను పాలకమండలిలో నియమించుకుని అక్రమాలు చేశారు. తిరుమలను శాంతియాగం, ప్రోక్షణతో పవిత్రం చేశారు. జగన్ పర్యటనతో మళ్లీ అపవిత్రమవుతుంది. ఇక్కడికి వచ్చి మరింత క్షోభకు గురిచేయవద్ద అని శ్రీనివాసానంద సరస్వతి వ్యాఖ్యానించారు. ఇకపోతే టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి వ్యాఖ్యలపై స్వామీజీలు ఆగ్రహం వ్యక్తం చేశారు. మాజీ సీఎం వైఎస్ జగన్ డిక్లరేషన్ ఇవ్వకపోతే దర్శనానికి అనుమతి లేదని చెప్పే హక్కు లేదని భూమన చేసిన వ్యాఖ్యలను తప్పుబట్టారు. తిరుమల శ్రీవారిని దర్శించుకోవాలంటే డిక్లరేషన్ ఇవ్వాల్సిందేనని స్పష్టం చేశారు. డిక్లరేషన్ ఇవ్వకపోతే అలిపిరి వద్ద జగన్‌ను అడ్డుకుంటామని హెచ్చరించారు. తిరుపతిలో సేవ్ తిరుమల.. సేవ్ టీటీడీ సమావేశం శుక్రవారం నాడు జరిగింది. ఈ సందర్భంగా సనాతన ధర్మ పరిరక్షణ బోర్డుకు స్వామీజీలు డిమాండ్ చేశారు. గత ఐదేళ్లలో తిరుమల పవిత్రతను కాపాడలేదని విమర్శించారు. తిరుమల శ్రీవారిని దర్శించుకోవాలంటే ఎవరైనా సంప్రదాయాలు పాటించాలని సాధుపరిషత్ అధ్యక్షుడు శ్రీనివాసానంద సరస్వతి స్వామీజీ అన్నారు. జగన్ ఏనాడైనా ఆయన సతీమణిని శ్రీవారి దర్శనానికి తీసుకొచ్చారా అని ప్రశ్నించారు. మన ఇంట్లో పూజ చేస్తేనే పక్కన భార్య ఉండేట్లు చూసుకుంటామని అన్నారు. హిందువుల మనోభావాలు, విశ్వాసాలను జగన్ ఏనాడూ గౌరవించలేదని విమర్శించారు.

# జగన్ తిరుమల రాకుండా అడ్డుకోలేరు

**- డిక్లరేషన్ కోరే హక్కు టిటిడికి లేదు - గతంలో లేని డిక్లరేషన్ ఇప్పడే ఎందుకు**

**- జగన్ డిక్లరేషన్ ఇవ్వాల్సిన అసవరం లేదు - టిటిడి మాజీ ఛైర్మన్ భూమన మండిపాటు**

**తొలి సమయం తిరుపతి,సెప్టెంబర్27:** జగన్‌ను అడ్డుకునే హక్కు ఎవరికీ లేదని టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి అన్నారు. డిక్లరేషన్ అడిగితే ఈ ప్రభుత్వ పతనం ఖాయమని హెచ్చరించారు. జగన్ డిక్లరేషన్ ఇవ్వకపోతే దర్శనానికి అనుమతి లేదనే హక్కు టీటీడీకి లేదని స్పష్టం చేశారు. ఎవరైనా శ్రీవారిని దర్శించుకోవచ్చని సనాతన ధర్మం చెబుతోందని తెలిపారు. అలాంటిది ఐదేళ్లు ముఖ్యమంత్రిగా పట్టు వస్త్రాలు సమర్పించిన జగన్‌ను డిక్లరేషన్ అడగడం దారుణమని విమర్శించారు. జగన్ డిక్లరేషన్‌పై ఇంత రాద్ధాంతం జరిగినా చంద్రబాబు మాట్లాడటం లేదని భూమన కరుణాకర్ రెడ్డి విమర్శించారు. డిక్లరేషన్ వెనుక రాజకీయ కుట్ర ఉందని తెలిపారు. ప్రభుత్వం ఎంత నిర్బంధిస్తే అంత పైకి లేస్తామని హెచ్చరిం చారు. చంద్రబాబు పాశవిక విధానాలను వ్యతిరేకిస్తూనే ఉంటామని భూమన తెలిపారు. చంద్రబాబు వెయ్యి నాలుకల ధోరణిని ఇకనైనా మానుకోవాలని హితవు పలికారు. వైఎస్ జగన్ తిరుమల పర్యటన ఆసక్తి రేపుతోన్న వేళ.. టీటీడీ మాజీ ఛైర్మన్, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నేత భూమన కరుణాకర్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు.. అసలు వైఎస్ జగన్ ను డిక్లరేషన్ అడిగే హక్కు టీటీడీకి లేదన్నారు. ఐదుసార్లు స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించిన వ్యక్తిని ఎలా అడిగుతారు డిక్లరేషన్ అని నిలదీశారు.. టీటీడీ డిక్లరేషన్ అడిగితే ఈ ప్రభుత్వం పతనం ప్రారంభం అయినట్లే అవుతుందన్నారు.. ఇక, సోనియా గాంధీ డిక్లరేషన్ పెట్టలేదు.. దానికి సాక్షం నేనే అన్నారు.. తిరుమలకు నడిచివెళ్లే అడిగే అధికారం కూడా టీటీడీకి లేదన్నారు.. కానీ, వైఎస్ జగన్ కాలినడకన తిరుమల వెళ్తారని ఎక్కడా చెప్పలేదని స్పష్టం చేశారు.. ఒక భక్తుడిగా వెంకన్న క్షేత్రానికి జగన్ వస్తున్నారు.. దర్శనానికి వస్తుంటే అడుగు అడుగునా ఆటంకం సృష్టిస్తున్నారు.. చంద్రబాబు చెప్పినట్లు పోలీసులు మాజీ ఎమ్మెల్యేలు, మంత్రులను హౌస్ అరెస్ట్ చేశారు.. నగర వైసీపీ నేతలను, కార్యకర్తలు బెదిరిస్తున్నారు.. భయభ్రాంతులకు గురి చేస్తూ నోటీసులు ఇచ్చారు.అసలు జగన్ అంటే ఎందుకు చంద్రబాబుకు భయం అని ప్రశ్నించారు.. భగవంతుని పట్ల అంతంతమాత్రమే నమ్మకం ఉన్న సూడో మనుషులు.. జగన్ డిక్లరేషన్ ఇవ్వాలని చేబుతున్నారని భూమన దుయ్యబట్టారు.. హిందూ ధర్మానికి విరుద్ధంగా కూటమి నేతలు వ్యవహరిస్తున్నారు. ఐదు సార్లు సీఎం హోదాలో స్వామివారికి పట్టు వస్త్రాలు జగన్ సమర్పించారని గుర్తుచేశారు.. లడ్డూ ఘటనలో డిఫెన్స్‌లో పడిపోయి ఇలాంటి పనులు చేస్తున్నారని మండిపడ్డారు.. పూజలు కూడా చేయకుండా ఇంటిలోనే ఉండాలని వైసీపీ నేతలను అడ్డుకుంటున్నారు. వైసీపీ నేతలు పూజలు కూడా చేయకూడదా? ఎందుకు మీకు అంతా భయం..? అని నిలదీశారు.. 40 శాతం ఓట్లు సాధించిన జగన్ వెంటా ఎవరు లేరని చెప్పడానికి కూటమి నేతలు ప్రయత్నిస్తున్నారని ఎద్దేవా చేశారు.. అది జరగని పని.. వ్యక్తిగత రాజకీయాల్లోకి దేవుడిని తీసుకుని రాకండి. చంద్రబాబు ఒకటి చేబితే.. పవన్ కల్యాణ్ మరొకటి చెబుతాడు.. హైందవ ధర్మాన్ని పవన్ ఒక్కడే కాపాడేవాడిలా మాట్లాడుతున్నాడు అంటూ ఎద్దేవా చేశారు..వైఎస్ జగన్ తిరుమల వస్తుంటే ఇప్పుడు పవన్ కల్యాణ్ సన్నాయి నొక్కలు నోక్కుతున్నాడు.. మేమే హిందువులు అన్నట్లుగా బీజేపీ నేతలు మాట్లాడుతు న్నారని భూమన అన్నారు. సనాతన ధర్మం పై మాకు విశ్వాసం ఉంది? చంద్రబాబు స్వయంగా జగన్ రావాలని ఆహ్వానం పంపాలి. జగన్ ను అడ్డుకుంటే సనాతన ధర్మాన్ని వ్యతిరేకించినట్లే.. దీని వెనుక రాజకీయ కుట్ర ఉందన్నారు.. ప్రభుత్వం ఎన్ని అడ్డంకులు సృష్టించిన జగన్ స్వామివారిని దర్శనం చేసుకునే వెళ్తారని స్పష్టం చేశారు.. చంద్రబాబు సైలెంట్ గా ఉండి మిత్ర పక్షాలను, పోలీసులను రెచ్చగొడుతున్నారు. నిన్నటి వరకు లడ్డూతో డైవర్షన్ పాలిటిక్స్ చేశారు.. లడ్డూలో పస తగ్గడంతో ఇప్పుడు డిక్లరేషన్ అంటూ మొదలెట్టారు అంటూ భూమన కరుణాకర్‌రెడ్డి మండిపడ్డారు.

# ఉద్రిక్తంగా మూసీ ప్రక్షాళన

**- సర్వేను అడ్డుకున్న నిర్వాసితులు**

**- పెట్రోల్ పోసుకుని యువకుడి ఆత్మహత్యాయత్నం - ఏళ్లుగా ఇక్కడే స్థలాలు కొనుక్కుని ఉంటున్నామని వెల్లడి**

**- రజాఏందర నగర్ వద్ద రోడ్డెక్కి ధర్నాకు దిగడంతో ట్రాఫిక్ జామ్**

**తొలి సమయం హైదరాబాద్,సెప్టెంబర్27:** గ్రేటర్ హైదరాబాద్‌లో ఆపరేషన్ మూసీ ప్రక్రియ శరవేగంగా జరుగుతోంది. మూసీ సుందరీకరణలో భాగంగా నదీ గర్భంతోపాటు పరివాహక ప్రాంతంలో కట్టుకున్న ఇళ్లు, అపార్ట్‌మెంట్లు, ఇతర నిర్మాణాలను తొలగించి వారికి ప్రత్యామ్నాయం చూపించే విధంగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. దీంతో మహానగరంలో ఎక్కడ చూసినా మూసీ ప్రక్షాళన అంశం హాట్ టాపిక్‌గా మారింది. అయితే ఏళ్ల తరబడి నివాసముంటున్న తమను నివాసాల నుంచి వెళ్లగొడుతుండడంతో నిర్వాసితులు ఆందోళనకు గురవుతున్నారు. మూసీ ప్రక్షాళనలో భాగంగా పరిపరివాహక ప్రాంతాల్లో రెవెన్యూ అధికారులు సర్వేను వేగవంతం చేశారు. బఫర్ జోన్,మూసీ రివర్ బెడ్ పరిధిలోని అక్రమ నిర్మాణాలను గుర్తించి మార్కింగ్ చేస్తున్నారు. ఈ క్రమంలో చైతన్యపురి వినాయక్‌లో మూసీ సర్వేకు వచ్చిన అధికారులను స్థానికులు అడ్డగించారు. మా ఇండ్లు కూల్చొద్దు.మాకు అన్ని రకాల రిజిస్ట్రేషన్ ఉన్నాయి. కరెంట్, వాటర్ సప్లయ్ ఉన్నాయి.ఇప్పుడు ఎందుకు వచ్చారు అంటూ అధికారులను స్థానికులు, కార్పొరేటర్లు నిలదీశారు. ఓ యువకుడు పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. దీంతో ఉద్రిక్తత నెలకొంది. మరోవైపు రాజేంద్రనగర్ తహసీల్దార్ సిబ్బందిని, రెవెన్యూ, మున్సిపల్, ఎలక్ట్రిక్రల్ అధికారులను సర్వే వద్దు వెళ్లి పోండంటూ మహిళలు అడ్డుకున్నారు. లంగర్ హౌస్ పోలీస్ స్టేషన్ పరిధిలో రింగ్ రోడ్డుకు అడ్డంగా కూర్చుని డిఫెన్స్ కాలనీ వాసులు నిరసనకు దిగారు. దీంతో కిలోమీటర్ల మేర ట్రాఫిక్ జాం అయ్యింది. తమకు అన్యాయం చేస్తున్నారని స్థానికులు నినాదాలు చేశారు. మూసీనది లోపల, బఫర్‌జోన్, ఎఫ్‌టీఎల్ పరిధిలోని నిర్మాణాలపై ప్రభుత్వం దృష్టి సారించింది. ఈ మేరకు మొదటి విడతలో నదీ గర్భంలోపల కట్టుకున్న ఇళ్లు, నిర్మాణాలను తొలగించేందుకు రెవెన్యూ, మూసీ అధికారులు ముందుకుసాగు తున్నారు. గురువారం లంగర్‌హౌజ్‌లోని ఆశ్రంనగర్, గోల్కొండ, ఇబ్రహీంబాగ్, కిషన్‌బాగ్, శంకర్‌నగర్, మూసారాంబాగ్, చాదర్‌ఘాట్, చైతన్యపురి, తదితర ప్రాంతాల్లో రెవెన్యూ అధికారులు ఇంటింటి సర్వే చేపట్టారు. ఈ మేరకు నిర్వాసితుల నుంచి ఆధార్‌కార్డు, కరెంట్ బిల్లు, నల్లా బిల్లులను సేకరించారు. ఇదే సమయంలో ప్రతి ఇంటిగోడకు ఆర్‌బీ-ఎక్స్ అంటే రివర్‌బెడ్‌లో ఇల్లు ఉందని సూచిస్తూ ముద్రవేశారు. నిర్వాసితులకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను కేటాయిస్తామని భరోసా కల్పించాలని సూచించింది. కాగా, గతంలో చేపట్టిన సర్వే ప్రకారం.. మూసీ పరివాహకం 55 కిలోమీటర్ల పరిధిలో దాదాపు 12,184పైగా అక్రమ కట్టడాలున్నట్లు రెవెన్యూ, హెచ్‌ఎండీఏ, జీహెచ్‌ఎంసీ, పోలీసు, ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగ అధికారులు తేల్చారు. నదీగర్భంలో 1,595 నిర్మాణాలను గుర్తించారు. ఇందులో 288 భారీ నిర్మాణాలు ఉన్నట్లు తేల్చారు. అలాగే నది సరిహద్దు నుంచి రెండు వైపులా 50 మీటర్ల వరకు ఉన్న నిర్మాణాలను బఫర్‌జోన్ కింద గుర్తించారు. ఇందులో మొత్తం 7,851 అక్రమ నిర్మాణాలు, 1,032 భారీ నిర్మాణాలున్నట్లు గుర్తించారు. ఇదిలా ఉండగా, ఎఫ్‌టీఎల్ పరిధిలో 3,004 అక్రమ కట్టడాలున్నట్లు తేల్చారు. నదీగర్భంలో ఇళ్లు కట్టుకున్న వారికి డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు కేటాయిస్తున్న మాదిరిగానే.. బఫర్‌జోన్‌లోని ప్రభుత్వ స్థలంలో ఉన్న నిర్వాసితులకు కూడా రెండు పడకల ఇంటిని ఇవ్వనున్నారు. బఫర్‌జోన్‌లోని ప్రైవేట్ స్థలాల్లో చేపట్టిన భారీ నిర్మాణాలు, అపార్ట్‌మెంట్లు, ఇళ్లకు మాత్రం 2013 భూసేకరణ చట్టం ప్రకారం పరిహారంతోపాటు ఇంటి వ్యయాన్ని చెల్లించేందుకు ప్రభుత్వం నిర్ణయించినట్లు సమాచారం. ప్రధానంగా చెరువుల బఫర్‌జోన్, ఎఫ్‌టీఎల్ పరిధిలో కొనుగోలు చేసిన వారు హైరానా పడుతున్నారు. ఇదిలా ఉండగా, నదీ సరిహద్దు నుంచి రెండు వైపులా 50 మీటర్ల బఫర్‌జోన్‌లో ప్రభుత్వ, ప్రైవేట్ స్థలాల్లో ఇళ్లు, భారీ నిర్మాణాలు చేపట్టిన వారు ఆందోళనకు గురవుతున్నారు. ప్రధానంగా రూ. లక్షలు, కోట్లు వెచ్చించి అపార్ట్‌మెంట్లు కొనుగోలు చేసిన ఉద్యోగులు, ఇతరులు ఆందోళన చెందుతున్నారు. ఏ సమయంలో తమను ఇక్కడి నుంచి పంపిస్తారోనని టెన్షన్‌కు లోనవుతున్నారు. మూసీ ప్రక్షాళనలో భాగంగా గండిపేట మండలంలో అధికారుల బృందం సర్వే చేపట్టింది. తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో బృందం సభ్యులు బైరాగిగూడ, హైదర్షాకోట్ ప్రాంతంలో ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లలో ఉన్న ఇళ్లను గుర్తించి వాటికి మార్కింగ్ చేశారు. అధికారులు నిర్వహిస్తున్న ఈ సర్వేకు పోలీస్ బందోబస్తును కూడా కల్పించారు.

# నామతం సమానత్వం..డిక్లరేషన్‌లో రాసుకోండి

**- ఆలయానికి వెళుతుంటే అడ్డుకోవడం దుర్మార్గం - హిందూ ధర్మాన్ని రాజకీయాలకు వాడుకోవడం సరికాదు**


**- లడ్డూ వివాదాన్ని తప్పదోవ పట్టించే యత్నంలో డిక్లరేషన్ - మాజీ సిఎంకే ఇంతటి అవమానం జరిగితే సామాన్యల గతేం**

**- తిరుమల పర్యటన రద్దు చేసుకున్న జగన్..మీడియాతో సమావేశం**

**అమరావతి,సెప్టెంబర్27:** నా మతమేమిటని అందరూ అడుగుతున్నారని..నా మతం మానవత్వ మని కావాలంటే డిక్లరేషన్‌లో రాసుకోవాలని జగన్ సవాల్ చేశారు. దేవుడి దగ్గరకు వెళ్తుంటే ఏ మతం అని అడుగుతారా అని ప్రశనించారు. తిరుమల పర్యటనను రద్దు చేసుకున్న తర్వాత జగన్ మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా డిక్లరేషన్ అంశంపై స్పందించారు. తాను నాలుగు గోడుల మధ్య బైబిల్ చదువుతానని ప్రకటించారు. అందులో తప్పేముందన్నారు. బయటకు వెళ్తే హిందూ సంప్రదాయాలను అనుసరిస్తానని చెప్పారు. అలాగే ఇస్లాంనూ గౌరవిస్తానని.. సిక్కిజంను కూడా ఆచరిస్తానని చెప్పుకొచ్చారు. తన మతం మానవత్వమేనన్నారు. గతంలో తాను పదిహేను సార్లకుపైగా తిరుమల కొండపైకి వెళ్లి వచ్చానన్నారు. మాజీ ముఖ్యమంత్రికే ఈ పరిస్థితి వస్తే దళితుల పరిస్థితి ఏమిటని జగన్ ప్రశ్నించారు. హిందూ ధర్మాన్ని రాజకీయాలకు వాడుకోవడం కరెక్ట్' కాదన్నారు. తనను అడ్డుకోవడానికి ఇతర రాష్ట్రాల నుంచి బీజేపీ నేతల్ని కూడా తీసుకు వచ్చారని ఆరోపించారు. పాదయాత్ర చేసిన తర్వాత నడుచుకుంటూ తిరుమలకు వెళ్లాలని.. ముఖ్యమంత్రిగా ఉంటూ పట్టు వస్త్రాలు సమర్పించానని జగన్ తెలిపారు. అలాంటి తనను అడ్డుకోవాలనుకోవడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. గుడికి వెళ్లే వ్యక్తిని ఏ మతం అని అడుగుతారా అని జగన్ ఆవేదన వ్యక్తం చేశారు. తిరుమలలో అన్యమతస్తులు శ్రీవారి దర్శనానికి వస్తే.. తమకు దేవదేవునిపై నమ్మకం ఉందని డిక్లరేషన్ ఇవ్వడం చాలా కాలంగా సంప్రదాయంగా ఉంది. గతంలో సోనియా గాంధీ, అబ్దుల్ కలాం కూడా డిక్లరేషన్లు ఇచ్చారు. అయితే ఆ తర్వాత రాజకీయ నేతలు మత పరమైన అంశాల్లో ఇలాంటి డిక్లరేషన్లు ఇవ్వడానికి సిద్ధపడటం లేదు. ఇప్పుడు జగన్మోహన్ రెడ్డి కూడా అలాంటి డిక్లరేషన్ అడుగుతున్న కారణమంగానే తిరుమలకు వెళ్లుండా ఆగిపోయినట్లుగా తెలుస్తోంది. డిక్లరేషన్ విషయంలో ఆయన చేసిన వాదనను బట్టి ఈ విషయం అర్థం చేసుకోవచ్చని అంచనా వేస్తున్నారు. కూటమిలోఉన్న బీజేపీని కూడా ప్రశ్నిస్తున్నానని.. మత రాజకీయాలు చేయడం ఏమిటని మండిపడ్డారు. తిరుమల లడ్డూకు తయారు చేసిన నెయ్యిలో జంతువుల కొవ్వు కలిసిందని అబద్దాలు ప్రచారం చేస్తున్నారని జగన్ మరోసారి స్పష్టం చేశారు. కల్తీ జరగకపోయినా జరిగిందని ప్రచారం చేసి చంద్రాబాబే శ్రీవారి ఆలయ ప్రతిష్టను దెబ్బతీశారని.. మళ్లీ ఆయనే సిట్ వేశారని మండిపడ్డారు. మొత్తంగా జగన్ తిరుమల పర్యటన రద్దునకు.. డిక్లరేషనే ప్రధాన కారణంగా భావిస్తున్నారు. దైవ దర్శనానికి వెళ్తామంటే అడ్డుకునే ప్రయత్నం చేయడం దేశంలో ఎప్పుడూ జరిగి ఉండదని అని జగన్ అన్నారు. జగన్ తిరుమల పర్యటనకు అనుమతి లేదని మా పార్టీ నేతలకు పోలీసులు నోటీసులు ఇస్తున్నారు. ఇలాంటి పరిస్థితులు గతంలో ఎప్పుడూ చూడలేదు. లడ్డూల అంశాన్ని పక్కదారి పట్టించేందుకు డిక్లరేషన్ అంశాన్ని తీసుకొచ్చారు. తిరుమల లడ్డూపై చెప్పినవన్నీ అబద్దాలని రుజువులు కనిపిస్తున్నాయి. సీఎం స్థానంలో ఉన్న వ్యక్తి అసత్యాలు చెబుతున్నారు. తిరుమల పవిత్రతను, శ్రీవారి ప్రసాదాన్ని రాజకీయం చేస్తున్నారని జగన్ ఆరోపించారు. తితిదేలో 6 నెలలకు ఒకసారి టెండర్లు పిలవడం దశాబ్దాలుగా జరుగుతున్నదే. తక్కువ రేటుకు కోట్ చేసిన వారికి తితిదే టెండర్ ఖరారు చేస్తుంది. దశాబ్దాలుగా జరుగుతున్న కార్యక్రమాన్ని వివాదాస్పదం చేస్తున్నారు. క్వాలిటీ చెక్ చేయించాకే వాహనాలు వస్తాయి. తితిదే కూడా క్వాలిటీ చెక్ చేస్తోంది. పరీక్షలో విఫలమైన వాహనాలను వెనక్కి పంపడం సాధారణం. గతంలో తెదేపా హయాంలో కూడా కొన్ని ట్యాంకర్లను వెనక్కి పంపించారు. కల్తీ ప్రసాదాలను భక్తులు తిన్నట్టుగా దుష్ప్రచారం చేస్తున్నారు.

## సిఎం సహాయనిధికి రిలయన్స్ 20కోట్ల విరాళం

**సిఎం రేవంత్‌ను కలిసి అందచేసిన కంపెనీ ప్రతినిధులు**



**హైదరాబాద్,సెప్టెంబర్27:** వరద బాధితుల సహాయార్థం విరాళాలు అందుతున్నాయి. తాజాగా తెలంగాణ ముఖ్యమంత్రి సహాయ నిధికి రిలయన్స్ ఫౌండేషన్ భారీ విరాళాన్ని అందజేసింది. రూ.20 కోట్ల చెక్కును సీఎంఆర్ఎఫ్‌కు అందజేశారు. శుక్రవారం ఉదయం రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పి ఎం ఎస్ ప్రసాద్, బోర్డు సభ్యులతో పాటు తెలంగాణ ,ఆంధ్రప్రదేశ్ రిలయన్స్ గ్రూప్ మెంటార్ పి వి ఎల్ మాధవరావులు జూబ్లీహిల్స్‌లోని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నివాసానికి వెళ్లారు. అక్కడ సీఎంను కలిసి ఆయనకు రూ.20 కోట్ల చెక్కును అందజేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఇటీవలే కురిసిన భారీ వర్షాలకు పలు ప్రాంతాల్లో వరద సంభవించిన విషయం తెలిసిందే. ముఖ్యంగా ఖమ్మం జిల్లా పూర్తిగా నీట మునిగింది. అనేక మంది ఇళ్లను కోల్పోయారు. ఈ నేపథ్యంలో వరద బాధితులను ఆదుకునేందుకు పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు, వ్యాపారవేత్తలు ముందుకు వస్తున్నారు. ఇప్పటికే తెలంగాణ సీఎం రిలీఫ్ ఫండ్‌కు చిరంజీవి, బాలకృష్ణ, ఎన్టీఆర్, మహేశ్ బాబు, సాయిధరమ్‌తేజ్, విశ్వక్‌సేన్ సహా పలువురు విరాళాలు అందించారు.

## ఢీకొన్న ఇంజనీరింగ్ కాలేజీల బస్సులు

**డ్రైవర్ మృతి...20 విద్యార్థులకు గాయాలు**

**తొలి సమయం మెదక్,సెప్టెంబర్27:** మెదక్ జిల్లాలో నర్సాపూర్ సమీపంలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. పట్టణ శివారులోని క్లాసిక్ గార్డెన్ వద్ద బీవీఆర్ఐటీ కళాశాలకు చెందిన రెండు బస్సులు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో ఇద్దరు డ్రైవర్లు తీవ్రంగా గాయపడ్డారు. డ్రైవర్లు బస్సుల్లో ఇరుక్కుపోవడంతో బయటకు తీయడానికి శ్రమించాల్సి వచ్చింది. వారిలో నాగరాజు (50) మృతిచెందారు. 20 మందికి పైగా విద్యార్థులకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ఆస్పత్రులకు తరలించారు. ఘటనాస్థలానికి నర్సాపూర్ సీఐ జాన్ రెడ్డి, ఎస్సై లింగం చేరుకుని పరిశీలించారు. ఈ ప్రమాదంతో నర్సాపూర్- సంగారెడ్డి మార్గంలో భారీగా వాహనాలు నిలిచిపోయాయి. ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించేందుకు పోలీసులు, కళాశాల సిబ్బంది చర్యలు చేపట్టారు.

## కొండా లక్ష్మణ్‌కు ఘనంగా నివాళి



**హైదరాబాద్,సెప్టెంబర్27:**స్వాతంత్ర్య సమరయోధుడు, తెలంగాణ కోసం సర్వస్వం ధారపోసిన త్యాగశీలి ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి సందర్భంగా పలువురు ఆయనకు ఘనంగా నివాళి అర్పించారు. జూబ్లీహిల్స్ నివాసంలో ఆయన చిత్రపటానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నివాళులు అర్పించచారు. చిత్రంలో సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ఎమ్మెల్యేలు వివేక్, మైనంపల్లి రోహిత్, శాట్ చైర్మన్ శివసేనా రెడ్డి ఉన్నారు. ఇదిలావుంటే ఆచార్యకు మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రొఫెసర్ కోదండరామ్ తదితరులు నివాళి అర్పించారు. తొలిదశ ఉద్యమంలో ఆయనది కీలక భూమికి అని కొనియాడారు.

## వరంగల్ భద్రకాళి ఉత్సవాలకు సిఎంకు ఆహ్వానం

**తొలి సమయం హైదరాబాద్,సెప్టెంబర్27:**వరంగల్ భద్రకాళి శరన్నవరాత్రి ఉత్సవాలకు సర్వం సిద్ధం చేశారు. ఉత్సవాలను ఏటా ఘనంగా నిర్వహిస్తారు. దీంతో భారీగా ఏర్పాట్లు చేశారు. ఈక్రమంలో జూబ్లీహిల్స్ నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని వరంగల్ శ్రీ భద్రకాళీ దేవస్థానం చైర్మన్ శేషు, ఈవో శేషుభారతి, ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డిలు కలిశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి శ్రీ భద్రకాళీదేవి శరన్నవరాత్రి మహోత్సవ ఆహ్వానాన్ని అందజేసారు. ఉత్సవాలకు రావాలని ఆహ్వానించారు.

## సిఎం రేవంత్‌తో రోష్ని నాడార్ మల్హోత్రా భేటీ

**సిఎంను కలిసిన జపాన్ రాయబారి**

**తొలి సమయం హైదరాబాద్,సెప్టెంబర్27:** సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని హెచ్‌సిఎల్ టెక్నాలజీస్ చైర్‌పర్సన్ రోష్ని నాడార్ మల్హోత్రా మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో టెక్నాలజీ అభివృద్ధికి తమవంతు సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. అలాగే ఫ్యూచర్ సిటీ నిర్మాణం, స్కిల్ వర్సిటీ ఏర్పాటుపై సిఎం వివరించారు. అలాగే సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని చెన్నైలోని జపాన్ కాన్సుల్-జనరల్ టకాహషి మునియో మర్యాదపూర్వకంగా కలిసారు.

## ఆర్‌పి పట్నాయక్ కుమారుడిపై దాడి

**కొట్టడంతో పాటు..చెవి కొరికిన సీనియర్**

**రాయదుర్గం పోలీసులకు ఫిర్యాదు చేసిన పట్నాయక్**

**తొలి సమయం హైదరాబాద్,సెప్టెంబర్27:** తన కుమారుడు వైష్ణవ్‌పై కళాశాలలో సీనియర్ విద్యార్థి దాడి చేయడంపై ప్రముఖ సంగీత, సినీ దర్శకుడు, నటుడు ఆర్పీ పట్నాయక్ గురువారం రాత్రి రాయదుర్గం పోలీసులను ఆశ్రయించారు. సీనియర్ విద్యార్థులు తరచూ ర్యాగింగ్ చేస్తూ దాడి చేస్తున్నారంటూ ఆయన ఫిర్యాదు చేశారు. ఓ ప్రైవేటు కళాశాలలో వైష్ణవ్ ఎంబీఏ చదువుతున్నాడని, కళాశాల బస్సులో ఇంటికి వస్తున్న సమయంలో సీనియర్ విద్యార్థి శ్యామ్ దాడి చేసి తీవ్రంగా గాయపరిచాడని పోలీసులకు ఆర్పీ తెలిపారు. తీవ్రంగా కొట్టి చెవి కొరికినట్లు ఆయన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఘటనను కళాశాల యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లినా ఫలితం శూన్యమని పట్నాయక్ చెప్పారు. అందుకే పోలీసులను ఆశ్రయించినట్లు వెల్లడించారు. దాడి జరగడంతో వైష్ణవ్ ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్సపొందుతున్నట్లు ఆయన తెలిపారు. ఆర్పీ పట్నాయక్ ఫిర్యాదు స్వీకరించిన రాయదుర్గం పోలీసులు.. నిందితుడు శ్యామ్‌పై కేసు నమోదు చేశారు. ఫిర్యాదు ఆధారంగా కేసు దర్యాప్తు చేస్తామని పోలీసులు తెలిపారు. కాగా, ఆర్పీ పట్నాయక్ విషయానికి వస్తే.. ఒకప్పుడు టాప్ సంగీత దర్శకుడిగా దూసుకెళ్లిన ఆర్పీ పట్నాయక్ ఆ తర్వాత కొంతకాలం దర్శకుడిగానూ ప్రతిభ కనబరిచారు.

# హైడ్రా దూకుడు..విపక్షాల విమర్శలు !



హైడ్రా దాడులతో విపక్ష బిఆర్ఎస్, బిజెపిలు లోలోపల ఆనందంగా ఉన్నాయి. హైడ్రా ఎంతగా దూకుడు ప్రదర్శిస్తే ప్రభుత్వంపై అంతగా వ్యతిరేకత వస్తుందన్న భావనలో ఈ రెండు పార్టీలు ఉన్నాయి. అందుకే పేదలకు మద్దతుగా మాట్లాడుతున్నాయి. అగ్గి రాజేసేలా మాట్లాడుతున్నాయి. ఎక్కడ లేని మొసలి కన్నీరు కారుస్తున్నాయి. ప్రజలు తిరుగుబాటు చేయాలని కోరుకుంటున్నాయి. ఈ క్రమంలో ఇప్పుడు గతంలో ఆక్రమణలపై కెసిఆర్ సిఎంగా ఉండగా మాట్లాడిన వీడియోలు కూడా వైరల్ అవుతున్నాయి. ఆక్రమణలు కూల్చాల్సిందే అని ఆనాడు కెసిఆర్ గట్టిగానే అన్నారు. దీనికి సమాధానం చెప్పాలని మరోవైపు కాంగ్రెస్ డిమాండ్ చేస్తోంది. మొత్తంగా ఎవరికి వారు రాజకీయ కోణంలో తమకు లాభమా కాదా అనన ధోరణిలో మాట్లాడుతున్నారు. హైదరాబాద్‌లో దశాబ్దాలు గా మూసీ ఆక్రమణలు జరిగాయి. ఓ నది కాస్తా.. చిన్న మురికి కాలువగా మారిపోయింది. ఇప్పుడు అది మొత్తం క్లియర్ చేయబోతున్నారు.అక్కడి నిర్వాసితులకు నష్టపరిహారం... పేదలకు డబుల్ బెడ్ రూం ఇళ్లు ఇవ్వాలని నిర్ణయించారు. అయినా అక్కడ కూల్చివేతల వల్ల జరిగే నెగెటివ్ ప్రచారం అంతా ఇంతా కాదు. అయినప్పటికీ రేవంత్ రెడ్డి ఏ మాత్రం ఆలోచించడం లేదు. అయితే అందరికన్నా బిఆర్ఎస రాజకీయ లబ్ది పొందేలా చూస్తున్నది. వివిధ అంశాలపై ఎదురుదాడి చేయడం ద్వారా తమపై వచ్చిన అవినీతి, అక్రమాలను కప్పిపుచ్చుకునే ప్రయత్నం చేస్తోంది. హైడ్రాతో రేవంత్‌రెడ్డికి చెడ్డపేరు వస్తుందని, అది తమకు కలసి వస్తుందని భావిస్తోంది. అందుకే రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై ఇప్పుడు విపక్ష బీఆర్ఎస్ ఏకపక్ష దాడి చేస్తోంది. కూల్చివేతల కారణంగా ప్రభుత్వంపై ప్రజలు తిరగబడే స్థాయికి వచ్చారని అంటున్నారు. అయితే రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఈ విషయంలో ఏ మాత్రం తగ్గడం లేదు. తదుపరి మూసీ పరివాహక ప్రాంతాన్ని టార్గెట్ గా పెట్టుకుంది. కూల్చివేతలకు ముహుర్తం ఖరారు చేసు కుంది. మూసీలో ఆక్రమణలపై మార్కింగ్ చేసేస్తున్నారు. అయితే చాలా కాలంగా మూసీని ఆక్రమించుకుని ఉంటున్నారు కాబట్టి ఉన్న పళంగా వారిని తరిమేయకుండా.. పేదకు ఇళ్లు ఇస్తున్నారు. ఇప్పటికే నిర్మితమైన పదిహేను వేల డబుల్ బెడ్ రూం ఇళ్లు వారికి కేటాయిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. ఇకపోతే ఇప్పుడు సోషల్ మీడియా లో కూల్చివేతలకు వ్యతిరేకంగా జరుగుతున్న ప్రచారం అంతా ఇంతా కాదు. అంతా నేరుగా రేవంత్ రెడ్డినే విమర్శిస్తున్నారు.

ఆయనే మా ఇళ్లను కూలగొాడు తున్నారని చెబుతున్నారు. మూసీ ఆక్రమణదారుల్లో కొంత మంది అలాగే చెబతున్నారు. ఇదే అదనుగా ఇక ప్రజలు తిరగబడటమే మిగిలిందన్నట్లు బీఆర్ఎస్ నేతల ప్రచారం ఉంటోంది. అయితే సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారాన్ని సీఎం రేవంత్ రెడ్డి పట్టించుకోవడం లేదు. తాను తీసుకుంటున్న నిర్ణయాలు, అమలు చేస్తున్న కార్యక్రమాల వల్ల ఉపయోగం ఏమిటో ప్రజలకు ఖచ్చితంగా తెలుసని ధీమాగా ఉన్నారు. అందుకే ఆయన తనకు వ్యతిరేకంగా జరుగుతున్న ప్రచారాన్ని లెక్క చేయకుండా పని చేసుకుంటూ పోతున్నారు. ఏదైనా పని ప్రారంభించి నప్పుడు సాఫీగా సాగిపోతే ఆ పనికి లేదా ఆ పని ద్వారా వచ్చే విజయానికి పెద్దగా గుర్తింపు ఉండదు. ఎంతో పోరాటం ద్వారా సాధించే విజయమే గుర్తుండిపోతుంది. ఇప్పుడు రేవంత్ రెడ్డి కూడా హైదరాబాద్ ను తాను అనుకున్నట్లుగా తీర్చిదిద్దడానికి మొదట్లో వ్యతిరేకత కనిపించినా.. తరవాత ప్రజలు అర్థం చేసుకుంటారని గట్టిగా నమ్ముతుతున్నారు. నిజంగా మూసీ పూర్తి స్థాయిలో ప్రక్షాళన చేసి.. అనుకున్న విధంగా ప్రాజెక్టును పట్టాలెక్కిస్తే.. రివర్ సిటీగా హైదరాబాద్ మారిపోతుంది. బ్యూటిఫుల్ లుక్ వస్తుంది. చెరువులు, నాలాల ఆక్రమణలు లేకపోతే.. ఎంత వర్షం పడినా ముంపు ఉండదు. మళ్లీ ప్రజా తీర్పునకు వెళ్లే సరికి ఈ ఫలితాలు కనిపిస్తాయని ప్రజలు ఆశీర్వదిస్తారని రేవంత్ రెడ్డి నమ్ముతున్నట్లుగా ఉంది. నాలుగేళ్ల కిందట హైదరాబాద్‌లో అతి భారీ వర్షం కురిసింది. ఎంత అంటే.. ఎప్పుడూ నీళ్లు చూడని రోడ్లు కూడా నదుల్లా పారాయి. పదుల సంఖ్యలో జనం కొట్టుకుపోయారు. హైదరాబాద్‌లోని సగం ఇళు నీట మునిగాయి. అంత వరద వందేళ్లలో రాలేదని అప్పటి ప్రభుత్వం చెప్పింది. నాలాలు కబ్జాకు గురయ్యాయని.. చెరువుల్ని కబ్జా చేశారని అన్నింటినీ క్లియర్ చేసి..మరోసారి అలాంటి పరిస్థితి రాకుండా చూస్తామని ప్రకటించారు. కానీ ఇప్పుడు అదే బీఆర్ఎస్ పార్టీ ప్రతిపక్షంలో కూల్చివేతల్ని వ్యతిరేకిస్తోంది. రేవంత్ రెడ్డి ప్రభుత్వం తప్పు చేస్తోందని అంటోంది. హైడ్రా బాధితులకు అండగా ఉంటామని చెబుతోంది. ఇది ద్వంద్వ నీతి కాక మరోటి కాదు. కేవలం రాజకీయ లబ్ది కోసమే ఇలాంటి ప్రకటనలు చేస్తున్నారు. హైడ్రా ఇప్పటికీ నివాసం ఉన్న ప్రాంతాలను కూలగొట్టడం లేదని.. వారికి సమయం ఇస్తామని చెబుతోంది. కొత్తగా నిర్మాణంలో ఉన్నవాటిని మాత్రం వదిలి పెట్టేది లేదని చెబుతోంది. గత పదేళ్ల కాలంలో చెరువులు, ప్రభుత్వ భూములు విపరీతంగా కబ్జా అయ్యాయి. ఇటీవల కిష్టారెడ్డిపేటలో కూల్చివేసిన ఇళ్లు ఉన్నది ప్రభుత్వ భూమే. అలా వదిలేస్తే కబ్జా దారులకు వదిలేసినట్లవుతుంది. ఆ ధైర్యంతో వారు మరిన్ని కబ్జాలు చేస్తారు. ప్రభుత్వ భూములని తెలిసి కూడా చాలా మంది కొనుగోలు చేశారని ... మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వమే వస్తే తమ జోలికి రారన్నది వారి ధైర్యమని అనుకుంటున్నారు. కానీ ప్రభుత్వం మారడంతో మొత్తం సీన్ మారిపోయింది. మొన్నటి వరదల కారణంగా ఖమ్మం, విజయవాడ ప్రజలు ఎంతగా నష్టపోయారో చూశాం. అలాంటి పరిస్థితి హైదరాబాద్‌కు రాకుండా చూసుకోవాలి. ఖచ్చితంగా చెరువుల్ని.. నాలాల్ని.. కాపాడుకోవాలని ప్రజలు అంటున్నారు. దీని వల్ల ప్రభుత్వానికి మద్దతు లభిస్తోంది. మూసీ విషయంలో నిరుపేదలకు ప్రత్యామ్నాయం చూపించేందుకు రేవంత్ సర్కార్ రెడీ అయింది కాబట్టి.. అక్కడా వ్యతిరేకత రాదని.. వచ్చినా మిగతా ప్రజల మద్దతు ఎక్కువ ఉంటుందని భావిస్తున్నారు. కానీ దీనిని రాజకీయంగ ఆరాజేయాలని బిఆర్ఎస్, బిజెపిలు చూస్తున్నాయి.

# వంటింట్లో నూనెల మంట

**- భారీగా పెరిగిన వంటనూనెల ధరలు - లీటర్ ఆయిల్‌పై ఏకంగా రూ.20 వరకు పెరుగుదల**

**న్యూఢిల్లీ,సెప్టెంబర్27:** పండుగ సీజన్‌లో వంటనూనెలు మంటపెడుతున్నాయి. వంట చేసుకోవాలంటేనే ఆలోచించాల్సి వస్తోంది. దసరా, దీపావళి వంటి కీలక పండుగల సమయంలో వంట నూనెల ధరలుభారీగా పెరగడం ఆందోళనకు గురి చేసింది. లీటర్ సన్‌ఫ్లవర్ ఆయిల్ ప్యాకెట్ ఏకంగా 130 రూపాయలకు చేరింది. రిటైల్‌గా వెల్లుల్లి 450 కిలో అమ్ముతున్నారు. ఉల్లి 70పైనే అమ్ముతున్నారు. ఇలా ఒక్కటేమిటి..అన్ని నిత్యావసర ధరలు భారీగా పెరిగాయి. వీటికి తోడు నిత్యం వాడే నూనె ధరలు పెరగడం ప్రజల్లో ఆందోళన కలిగిస్తోంది. ప్రభుత్వ అధికారిక గణాంకాల ప్రకారం, ఈ నెల రోజుల్లో ఆవనూనె ధరలు 9.10 శాతం, పామాయిల్ ధరలు 14.16 శాతం పెరిగాయి. నెల రోజుల్లో, ఆవనూనె ధర ఇటు రిటైల్ మార్కెట్‌లో అటు ఆన్‌లైన్ కిరాణా కంపెనీల పోర్టల్స్‌లో 26 శాతం పెరిగింది. నెల రోజుల క్రితం ఆన్‌లైన్ కిరాణా పోర్టల్‌లో లీటరు ఆవనూనె రూ.139 కి లభించగా, ఇప్పుడు దీని ధర లీటరుకు రూ.176 కి చేరుకుంది. అంటే గత నెలలో ధరలు 26.61 శాతం పెరిగాయి. మస్టర్డ్ ఆయిల్‌ను ఉత్తర భారతదేశంలోని చాలా ప్రాంతాల్లో వంటనూనెగా ఉపయోగిస్తారు. ప్రభుత్వ లెక్కలు కూడా ఎడిబుల్ ఆయిల్ ధరల పెరుగుదల నిజమేనని చెబుతున్నాయి. కేంద్ర వినియోగదార్ల వ్యవహారాల శాఖకు చెందిన ధరల పర్యవేక్షణ విభాగం వెల్లడించిన వివరాల ప్రకారం.. నెల క్రితం, 25 ఆగస్టు 2024న లీటరు ఆవాల నూనె రూ.139.19 కి లభించగా,



ఇప్పుడు రూ.151.85 కి అందుబాటులో ఉంది. లీటరు ఆవనూనె దిల్లీలో రూ.165, ముంబయిలో రూ.183, కోల్‌కతాలో రూ.181, చెన్నైలో రూ.167 పలుకుతోంది.సాధారణంగా, దక్షిణ భారతదేశంలో వంటనూనెలుగా ఉపయోగించే పొద్దుతిరుగుడు పువ్వుల నూనె, పామాయిల్, సోయా ఆయిల్ రేట్లు కూడా పెరిగాయి. నెల రోజుల క్రితం, సన్‌ఫ్లవర్ ఆయిల్ లీటరు రేటు రూ.119.38 గా ఉండగా, ప్రస్తుతం లీటరు రూ.129.88 కి లభిస్తోంది. నెల క్రితం లీటరు రూ.98.28 గా ఉన్న పామాయిల్ ఇప్పుడు లీటరుకు రూ.112.2 కి చేరింది. సోయా ఆయిల్ ధరలు కూడా నెల రోజుల్లో లీటరుకు రూ.117.45 నుంచి రూ.127.62 కి పెరిగింది. వెజిటబుల్ ఆయిల్ ధర లీటరుకు రూ.122.04 నుంచి రూ.129.04 కి ఎగబాకింది.డిబుల్ ఆయిల్‌ల దిగుమతి సుంకాన్ని పెంచుతూ కేంద్ర ప్రభుత్వం ఇటీవల నిర్ణయం తీసుకుంది. దీనివల్లే వంటనూనెల దిగుమతులు ఖరీదయ్యాయి. క్రూడ్ సోయాబీన్ ఆయిల్, క్రూడ్ పామాయిల్, క్రూడ్ సన్‌ఫ్లవర్ ఆయిల్‌పై దిగుమతి సుంకాన్ని 0 నుంచి 20 శాతానికి; ర్గి÷న్డ్ ఎడిబుల్ ఆయిల్స్ దిగుమతిపై సుంకాన్ని 12.5 శాతం నుంచి 32.5 శాతానికి పెంచింది. ప్రభుత్వ నిర్ణయం వల్ల పామాయిల్ నుంచి సోయా వరకు అన్ని రకాల వంటనూనెల ఖరీదయ్యాయి. దేశీయ రైతుల ప్రయోజనాలను కాపాడేందుకు దిగుమతి సుంకాన్ని పెంచినట్లు కేంద్ర ప్రభుత్వం చెప్పినప్పటికీ, రేట్ల పెంపు ప్రభావం నేరుగా సామాన్య జనంపై పడింది. నూనెలను ఎక్కువగా వినియోగించే పండుగ సీజన్‌లో, సరైన టైమ్ చూసి సర్కారు దెబ్బకొట్టింది.

# నరక కూపంగా సంక్షేమ హాస్టళ్ల తీరు

**- కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతి ప్రకటనే నిదర్శనం**

**- పదేళ్లుగా పట్టించుకోని బిఆర్ఎస్ ప్రభుత్వం - ఇప్పడే సమస్యలు వచ్చాయన్న తీరుగా విమర్శలు**

**హైదరాబాద్,సెప్టెంబర్27:** జ్వరాల భయంతో హాస్టళ్లు వణికిపోతున్నాయి. రల్తీ ఆహారం కూడా కలవర పెడుతోంది. ఇకపోతే హాస్టళ్లలో ఉండేలా పరిస్థితులు లేవని కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతి తాజాగా చేసిన ప్రకటన దారుణ పరిస్థితులను కళ్లకు అద్దం పడుతున్నాయి. పదేళ్ల పాటు హాస్టళ్లను సంస్కరించామని చెప్పుకుంటున్న బిఆర్ఎస్ నేతలు దీనిపై కళ్లు తెరవాలి. ఇప్పుడే హాస్లళ్లలో సమస్యలు లేవు. అయితే ప్రత్యేక రాష్ట్రం ఏర్పడ్డ తరవాత వీటిని సంస్కరించలేదు. వాటి మానాన వాటిని వదిలేశారు.ఆర్భాటపు ప్రకటనలతో ప్రజలను మభ్య పెట్టారు. సన్న బియ్యం సరపరా పేరుతో కొన్ని రోజులు ఆరా÷-భాటం చేశారు. అయితే సమస్యలన్నింటికి ..ఇప్పుడు అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ కారణమంటూ చేస్తున్న విమర్శలు వారి కుసంస్కారానికి నిదర్శనంగా చూడాలి. అన్‌ఇన రంగాలను విస్మరించినట్లుగానే వసతి గృహాలను కూడా పదేళ్లుగా పక్కన పెట్టేశారు. హాస్టళ్లలో వసతులు, పరిస్థితులు బాగులేక విద్యార్థులు ఇంటిబాట పడుతున్నారు. ఇటీవలకాలంలో హాస్టళ్లలో విద్యార్థులు మృతి చెందడం అధికారులు, ప్రజాప్రతినిధులను కలవరానికి గురిచేస్తోంది. సీజనల్‌వ్యాధుల ముప్పును తప్పించుకునేందుకు పలుచోట్ల వైద్యశాఖ ఆధ్వర్యంలో చర్యలు తీసుకుంటున్నప్పటికీ పూర్తిస్థాయిలో అదుపులోకి రావడంలేదు. హాస్టళ్లలో కొన్నిచోట్ల మురుగునీరు పారుతోంది. మరికొన్ని చోట్ల డంప్‌యార్డులు, పారిశుధ్య సమస్య, ఇతర ఇబ్బందులుంటున్నాయి. ఇటీవల వర్షాలతో ఒక్కసారిగా దోమలు, ఈగలు ప్రబలడంతో జ్వరాల మోత మోగుతోంది. తలనొప్పి, కడుపునొప్పి, జ్వరం, జలుబు, దగ్గు, బాడీ పెయిన్స్, అలసట తదితరసమస్యలతోనే విద్యార్థులు బాధపడుతున్నారు. గిరిజన, సాంఘిక సంక్షేమ, మైనార్టీ, ఎంజేపీ, కస్తూర్బా, ఆదర్శ, జూనియర్, డిగ్రీ కళాశాలలతోపాటు ఇతర అన్ని గురుకులాల్లో అనేక ఇబ్బందులు ఉన్నాయనే ఆరోపణలున్నాయి. ఈ విద్యాసంస్థల్లో వేలాది మంది విద్యార్థులు చదువుకుం టున్నారు. వీరిలో అనేకమంది సీజనల్‌వ్యాధులబారిన పడుతున్నా యంత్రాంగం ఆశించిన స్థాయిలో చర్యలు తీసుకోవడం లేదు. హాస్టళ్లలో సిబ్బంది విద్యార్థులకు మెనూప్రకారం భోజనం పెట్టకపోవడం శాపంగా మారుతోంది. కొన్నిచోట్ల కలుషిత ఆహారం వల్ల విద్యార్థులు అనారోగ్యం పాలవుతున్నారు. కుళ్లిపోయిన కోడిగుడ్లు, నాణ్యతలేని ఆహారం అందిస్తూ అందిన కాడికి దోచుకుంటున్నారు. సంబంధిత ఆహార సరఫరా కాంట్రాక్టర్లు, సిబ్బంది మిలాఖత్ కావడం అధికారులు పట్టించుకోకపో వడంతో ఇష్టారాజ్యంగా తయారైంది. సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ప్రజలు కాచి చల్లార్చిన నీరు తాగాలని వైద్యులు సూచించారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల వల్ల వివిధ రకాల సీజన ల్ వ్యాధులు ప్రబలే అవకాశం అధికంగా ఉందన్నారు. ఈ విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండి తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

# పోషకాలు మిన్నగా ఉన్న నల్లవరి రకం

**ఖమ్మం రైతులకు లాభాలు తెస్తున్న పంట**

**ఖమ్మం,సెప్టెంబర్27:** మన జీవన విధానంలో మార్పులు వచ్చినట్టే.. ఇప్పుడు సాగులోనూ 'కాలా'నుగుణంగా వచ్చిన ఛేంజ్ ఇది! కాలాబాత్ అనే పిలిచే ఈ వరిని వల్లాపురంలో ఓ ఔత్సాహిక రైతు సాగు చేస్తున్నాడు. వైరా మండలం వల్లపురానికి చెందిన తుమ్మల రాణాప్రతాప్ బ్లాక్ రైస్ సేద్యం చేపట్టారు. బ్లాక్ రైస్‌ను పూర్వ కాలంలో చక్రవర్తులు, వారి కుటుంబ సభ్యులు తినేందుకే ఉపయోగించే వారని ప్రతీతి. అందుకే వీటికి చక్రవర్తుల బియ్యం అనే పేరు వచ్చింది. సాధారణ వరి కంటే బ్లాక్ రైస్ రకానికి చెందిన వరి ఎకరానికి పది నుంచి పదిహేను బస్తాలు మాత్రమే దిగుబడి వస్తుంది. నల్లబియ్యంలో కాలాబట్టీ/ మణిపూర్ బ్లాక్/ సుగంధభరితం/ రత్నచోడి/ నవారా నారాయణ కామిటి వంటి రకాలున్నాయి.

## గద్వాల ఎమ్మెల్యే డ్రైవర్ నర్సింహులు కుమారుడుని అభినందించిన ఎమ్మెల్యే

**తొలి సమయం గద్వాల్**



ఈరోజు గద్వాల జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నందు డ్రైవర్ నర్సింహులు కుమారుడు వినయ్ సాగర్ ఇటీవల నీటిపారుదల శాఖలో A.E.E ఉద్యోగం పొంది వనపర్తి జిల్లా పెబ్బేరు నందు పోస్టింగ్ వచ్చిన సందర్భంలో ఎమ్మెల్యే శ్రీ బండ్ల కృష్ణమోహన్ రెడ్డి గారు వినయ్ కి హార్థిక శుభాకాంక్షలు తెలిపి భవిష్యత్తులో మంచి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఎమ్మెల్యే గారు మాట్లాడుతూగద్వాల నియోజకవర్గం లోని అక్షరాస్యత లో వెనుకబడి ప్రాంతంగా పిలవబడే గట్టు మండలంలోని గట్టు లో చదువుకొని గట్టు మండలంలోని ఉన్నత స్థాయి ఉద్యోగంలో చాలా సంతోషంగా వార్షం వ్యక్తం చేశారు. ప్రతి ఒక యువత పట్టుదలతో కష్టపడి చదివితే కచ్చితంగా ప్రభుత్వ ఉద్యోగం సాధించడం కష్టమేమీ కాదని ఇలాగే ప్రతి ఒక్క యువత వినయ్ ను ఆదర్శంగా తీసుకొని వివిధ రంగాలలో రాణించాలని కోరారు.

## కస్తూరిబా, మోడల్ స్కూళ్లను సందర్శించిన ఎమ్మెల్యే డా.కవ్వంపల్లి సత్యనారాయణ



**తొలి సమయం కరీంనగర్ ప్రతినిధి:** కరీంనగర్ జిల్లా మానకొండూర్: మానకొండూర్ నియోజకవర్గం బెజ్జంకి మండల కేంద్రంలోని కస్తూరి బా గాంధీ బాలికల పాఠశాల, తెలంగాణ మోడల్ స్కూల్ ని మానకొండూరు నియోజకవర్గ శాసనసభ్యులు కవ్వంపల్లి సత్యనారాయణ సందర్శించారు.కస్తూరి బా గాంధీ బాలికల పాఠశాలలో అసంపూర్తిగా ఉన్న పాఠశాల భవనం పూర్తి చేయడానికి జిల్లా కలెక్టర్ నిధుల నుండి నిధులు మంజూరు చేయించమని త్వరలోనే పనులు ప్రారంభించి పూర్తి భవనం అందుబాటులోకి తీసుకువస్తామన్నారు.పాఠశాల ఆవరణలో నీరు నిల్వ ఉండటం వల్ల వెంటనే మట్టి పోయించాలని ఎంపీడీవో నీ ఆదేశించారు. తెలంగాణ మోడల్ స్కూల్ లో విద్యార్థుల మధ్యహ్న భోజనం తయారీ కోసం ఎమ్మెల్యే స్వంత నిధులతో సిలిండర్ గ్యాస్ స్టవ్ అందించారు.అలాగే పాఠశాల లో డైనింగ్ హాల్ నిర్మాణం కోసం కలెక్టర్ నిధుల ద్వారా నిధులు మంజూరు చేయిస్తామన్నారు.

## ఆవాసం స్కూల్‌కు సౌండ్ సిస్టం అందజేత

**ఆవాస విద్యాలయానికి సౌండ్ సిస్టం బహూకరణ**



**తొలి సమయం కరీంనగర్ ప్రతినిధి:** కరీంనగర్ జిల్లా జమ్మికుంట పట్టణం:తాము చదువుకున్న పాఠశాలకు పూర్వ విద్యార్థులు ఉడతాభక్తిగా సాయం చేశారు. వివరాల్లోకెళితే జమ్మికుంట పట్టణ పరిధిలోని కేశవపురంలోని విద్యారణ్య ఆవాస విద్యాలయానికి శుక్రవారం ఆ స్కూల్‌లో చదువుకున్న 2008-09 ఎస్ఎస్‌సీ బ్యాచ్ స్టూడెంట్స్ సౌండ్ సిస్టం బహూకరించారు. పాఠశాలలో పలు కార్యక్రమాల నిర్వహణకు ఆడియో సౌండ్ సిస్టం లేక కొంత ఇబ్బంది కలుగుతున్నదన్న విషయాన్ని ఉపాధ్యాయులు తెలపగా, విద్యార్థులు ముందుకొచ్చి అందజేశారు. రూ.50 వేలు విలువ చేసే సౌండ్ సిస్టంను స్కూల్‌కు అందించడటం పట్ల ఆవాస విద్యాలయం ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సిబ్బంది విద్యార్థులను అభినందించారు. తమ ఉన్నతికి తోడుపడిన పాఠశాలకు తిరిగి తమ వంతు సాయం చేయడం సంతృప్తినిచ్చిందని ఈ సందర్భంగా ఆవాస పూర్వ విద్యార్థులు వెల్లడించారు. కార్యక్రమంలోప్రధాన ఆచార్యులు సుధాకర్ రావు పోల్సాని, పూర్వ ప్రధాన చార్యులు టి. రాజమౌళి, ఉపాధ్యాయులు సర్వోత్తమ్ రెడ్డి, శ్రీకాంత్,ఆవాస పూర్వ విద్యార్థులు శివనాథుని తరుణ్, ఉప్పుల మహిపాల్ రెడ్డి, నాగమల్ల రాజేష్, లోనే ప్రశాంత్, వలబోజు రమణాచారి, ముల్లుపోజు కమలాకర్, కందాల సాయికుమార్, గాజుల సాగర్, బండి రంజిత్ కుమార్, సాకర్ మాన్ వెంకటేష్, అంబీరు శ్రీకాంత్, పెద్ది తిరుపతిరెడ్డి, కాశిరెడ్డి రాజు, డబ్బేట రాకేష్, ఆశ్వతి సంతోష్, ముసుకు శ్రీనివాస్, పొన్నాల నరేష్, సింగ కృష్ణమోహన్ రాజు తదితరులు పాల్గొన్నారు.

## లడ్డూ కల్తీలో బాధ్యులు మూల్యం చెల్లించుకోవాల్సిందే

**హిందూమతాన్ని కించపర్చడం సెక్యులరిజమా**

**ఎక్స్ వేదికగా నటి ఖుష్బూ పోస్ట్**

**చెన్నై,సెప్టెంబర్27:** దేశవ్యాప్తంగా చర్చనీయాంశమవుతోన్న లడ్డూ వివాదంపై నటి ఖుష్బూ స్పందించారు. ఎక్స్ వేదికగా ఆమె పోస్ట్ పెట్టారు. బాధ్యులు కచ్చితంగా మూల్యం చెల్లించుకోవాల్సిందే నన్నారు. 'తిరుమల లడ్డూ గురించి చాలామంది మాట్లాడుకుంటున్నారు. హిందూ మతాన్ని లక్ష్యంగా చేసుకున్నప్పుడు మనల్ని సైలెంట్‌గా ఉండమంటే ఎలా? ఇతర మతాల విషయంలోనూ ఇలానే వ్యవహరిస్తారా? అలాంటి ఆలోచన చేయాలంటేనే చాలామందికి వెన్నులో వణుకు పుడుతుంది. లౌకికవాదం అంటే ప్రతీ మతాన్ని గౌరవించడం. అంతేగానీ పక్షపాతంతో వ్యవహరించొద్దు. నేను హిందూ మతంలో పుట్టకపోయినా.. ఈ మతానికి చెందిన వ్యక్తిని పెళ్లి చేసుకున్నాను. నాకు అన్ని మతాలు సమానమే. హిందూ మతాన్ని అవమానించొద్దు.. చులకనగా మాట్లాడొద్దు. దాన్ని అగౌరవపరిస్తే సహించొద్దు. తిరుమల లడ్డూలు కల్తీ చేయడమంటే కోట్లాది మంది ప్రజల మనోభావాలు, విశ్వాసాలు దెబ్బతీయడమే. బాధ్యులు కచ్చితంగా మూల్యం చెల్లించుకోవాల్సిందే.

## జగన్ పర్యటనను అడ్డుకోవద్దని ఎన్డీఏ నిర్ణయం

**తిరుపతి,సెప్టెంబర్27:** మాజీ సీఎం వైఎస్ జగన్ తిరుమల పర్యటనను అడ్డుకోవద్దని ఎన్డీయే కూటమి నేతలు నిర్ణయించారు. తిరుపతిలో శుక్రవారం సమావేశమైన ఎన్డీయే కూటమి నేతలు.. జగన్ వెళ్లే దారిలో శాంతియుతంగా నిరసన తెలపాలని నిర్ణయించుకున్నారు. శ్రీవారి లడ్డూ కల్తీకి జగనే కారణమని ఈ నిరసన చెప్పాలని కార్యకర్తలకు సూచించారు. ఒకవేళ వైసీపీ రాజకీయ బల ప్రదర్శనకు దిగితే మాత్రం దీటుగా సమాధానం చెప్పాలని ప్లాన్ చేసుకున్నారు. గత ప్రభుత్వం తిరుమల ప్రసాదాన్ని అపవిత్రం చేసిందని తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు విమర్శించారు.

TEL TEL RNI NO 12283 VEMULA AYODHYA RAMULU TOLI PODDU PUBLICATIONS AND PRINTERS GRAPHICS
H-NO 1-6-155/43/45/4 NANDI NAGAR POST:MANDAL DIST: MAHABUBABAD TELANGANA STATE INDIA PIN CODE 506 101